TEL: T/TG/ 2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

## విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

పబ్లిషర్: హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక : 119 | సోమవారం 23-12-2024 | పేజీలు : 5 | వెల :4/-

# వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి భారత్, కువైట్ సంబంధాలు

కువైట్ సిటీ : భారత్, కువైట్ ఆదివారం తమ సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి పెంచుకున్నాయి. మొత్తం ద్వైపాక్షిక సంబంధాలకు కొత్త ఊపు ఇవ్వడంపై దృష్టి కేంద్రీకరిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ కువైట్ ఎమీర్ షేఖ్ మెషల్ అల్ అహ్మద్ అల్ జబెర్ అల్ సబాహ్‌తో విస్తృతంగా చర్చలు జరిపిన అనంతరం ఆ పరిణామం చోటు చేసుకున్నది. కువైట్ సిటీలోని బయన్ ప్రాసాదంలో తమ సమావేశంలో ఇద్దరు అధినేతలు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఔషధాలు, ఫిన్‌టెక్, మౌలిక వసతులు, భద్రత రంగాల్లో సహకారం పెంపుపై ప్రధానంగా చర్చించారు. కువైట్‌లోని పది లక్షల మందికి పైగా భారతీయుల సంక్షేమాన్ని చూస్తున్నందుకు ఎమీర్‌కు మోడీ ధన్యవాదాలు తెలియజేశారు. తమ గల్ఫ్ దేశం అభివృద్ధి ప్రస్థానంలో భారతీయ సమాజం తోడ్పాటుకు కువైటీ అధినేత అభినందనలు తెలిపారు. ఎమీర్‌తో తన భేటీని 'అద్భుతం'గా మోడీ 'ఎక్స్' పోస్ట్‌లో అభివర్ణించారు. 'కువైట్ ఎమీర్ గౌరవనీయ షేఖ్ మెషల్ అల్ అహ్మద్ అల్ జబెర్ అల్ సబాహ్‌తో అద్భుత సమావేశం జరిగింది. ఔషధాలు, ఐటి, ఫిన్‌టెక్, మౌలిక వసతులు, భద్రత వంటి కీలక రంగాల్లో సహకారం గురించి చర్చించుకున్నాం' అని మోడీ తెలిపారు. 'మా దేశాల మధ్య సన్నిహిత సంబంధాలకు అనుగుణంగా మా భాగస్వామ్యాన్ని వ్యూహాత్మక స్థాయిని పెంచాం.

- కువైట్ అగ్ర నాయకత్వంతో ప్రధాని మోడీ భేటీ
- పలు కీలక రంగాల్లో సహకారం పెంపు లక్షంగా చర్చలు
- కువైట్‌లో భారతీయుల శ్రేయస్సుపై ఎమీర్‌కు మోడీ ధన్యవాదాలు

మా మైత్రి రానున్న కాలంలో మరింతగా పరిఢవిల్లగలదని ఆశిస్తున్నా' అని మోడీ తెలియజేశారు. బయన్ ప్రాసాదానికి చేరుకున్న మోడీకి వైభవోపేత స్వాగతం లభించింది. కువైట్ ప్రధాని అహ్మద్ అల్ అబ్దుల్లా అల్ అహ్మద్ అల్ సబాహ్ ఆయనకు స్వాగతం పలికారు.

భారత ప్రధాని రెండు రోజుల పర్యటనపై శనివారం కువైట్ సిటీ చేరుకున్నారు. భారతీయ ప్రధాని ఒకరు ఈ గల్ఫ్ దేశాన్ని సందర్శించడం 43 ఏళ్లలో ప్రథమం. ప్రధాని, ఎమీర్ మధ్య చర్చలు భారత్, కువైట్ సంబంధాలను 'కొత్త పుంతలు' తొక్కించే మార్గాల అన్వేషణ లక్షంగా సాగాయని విదేశాంగ మంత్రిత్వశాఖ (ఎంఇఎ) అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ వెల్లడించారు. రెండు దేశాల మధ్య గల బలమైన చారిత్రక, స్నేహపూర్వక సంబంధాలను మోడీ, కువైటీ ఎమీర్ తమ చర్చల్లో గుర్తు చేసుకున్నారు. ద్వైపాక్షిక సహకారాన్ని మరింత విస్తరించేందుకు, పటిష్ఠం చేసేందుకు తమ సంపూర్ణ నిబద్ధతను వారు పునరుద్ఘాటించారు. కువైట్‌లోని పది లక్షల మందికి పైగా భారతీయ సమాజం సంక్షేమం కోసం చేస్తున్న కృషికి ఎమీర్‌కు ప్రధాని ధన్యవాదాలు తెలిపారని ఎంఇఎ వెల్లడించింది. తన '2035 లక్ష్యం' సాఫల్యానికి కువైట్ చేపట్టిన కొత్త పథకాలను మోడీ శ్లాఘించారని, ఈ నెల ప్రథమార్ధంలో గల్ఫ్ సహకార మండలి (జిసిసి) శిఖరాగ్ర సదస్సును విజయవంతంగా నిర్వహించినందుకు ఎమీర్‌ను ఆయన అభినందించారని ఎంఇఎ పేర్కొన్నది.

యుఎఇ, బహ్రెయిన్, సౌదీ అరేబియా, ఒమన్, ఖతార్, కువైట్‌తో కూడిన ప్రభావశీల బృందం జిసిసి. జిసిసి దేశాలతో భారత్ వాణిజ్య పరిమాణం 202223 ఆర్థిక సంవత్సరంలో 184.46 బిలియన్ అమెరికన్ డాలర్లుగా ఉన్నది. శనివారం అరేబియన్ గల్ఫ్ కప్ ప్రారంభ వేడుకకు 'గౌరవ అతిథి'గా తనను ఆహ్వానించినందుకు కూడా మోడీ తన కృతజ్ఞతలు తెలియజేశారు. కువైట్, గల్ఫ్ ప్రాంతంలో విలువైన భాగస్వామిగా భారత్ పాత్రను ఎమీర్ కొనియాడినట్లు



ఎంఇఎ ఒక ప్రకటనలో తెలియజేసింది. కువైట్ 'లక్ష్యం 2035' సాధన దిశగా భారత్ మరింత పాత్ర పోషించేందుకు కువైటీ అధినేత ఎదురు చూస్తున్నారని ఎంఇఎ తెలిపింది. భారత్‌ను సందర్శించవలసిందిగా ఎమీర్‌ను ప్రధాని మోడీ ఆహ్వానించారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆదివారం కువైట్ అత్యున్నత పురస్కారం 'ది ఆర్డర్ ఆఫ్ ముబారక్ అల్ కబీర్' స్వీకరించారు. అది ఆయనకు 20వ అంతర్జాతీయ అవార్డు. 'ది ఆర్డర్ ఆఫ్

మిగతా 2లో

## జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో కీలక సూచనలు చేసిన ఏపీ ఆర్థికమంత్రి పయ్యావుల

- 5 శాతానికి మించి జీఎస్టీ శ్లాబులో ఉన్న వస్తువులపై ఒక్క శాతం ఏపీ ఫ్లడ్ సెస్ విధించాలన్న మంత్రి పయ్యావుల కేశవ్
- పేదలకు రేషన్ ద్వారా ఇచ్చే పోర్టిఫైడ్ బియ్యంపై జీఎస్టీ సుంకాన్ని తగ్గించాలన్న పయ్యావుల
- ఇన్నోవేషన్ల ప్రోత్సాహకానికి గానూ రీసెర్చ్ సర్వీసెస్‌కు జీఎస్టీ నుంచి మినహాయింపు ఇవ్వాలన్న పయ్యావుల



**న్యూఢిల్లీ:** జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఏపీ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కీలక సూచనలు చేశారు. రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో శనివారం 55 వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఏపీకి సంబంధించిన వివిధ అంశాలపై ప్రస్తావించారు. కీలక రంగాలకు సంబంధించి జీఎస్టీ విధానంలో తేవాల్సిన మార్పు చేర్పులపై పయ్యావుల కీలక సూచనలు చేశారు. 5 శాతానికి మించి జీఎస్టీ శ్లాబులో ఉన్న వస్తువులపై రాష్ట్రంలో జరిగే రవాణాపై ఒక్క శాతం ఏపీ ఫ్లడ్ సెస్ విధించాలని సూచించారు. దీని వల్ల పేదలు, మధ్య తరగతి ప్రజలపై ఎలాంటి ప్రభావం ఉండదన్నారు. ఈ సెస్ ద్వారా ఏపీలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సహయ, పునరావాస చర్యలు చేపడతామని చెప్పారు. 2018లో కేరళ వరదల సమయంలో ఇదే తరహా సెస్ విధించిన విషయాన్ని పయ్యావుల గుర్తు చేశారు. ఇన్నోవేషన్‌లకు ప్రోత్సాహమిచ్చేలా ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు నిర్వహించే రీసెర్చ్ సర్వీసెస్‌కు జీఎస్టీ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. పేదలకు రేషన్ ద్వారా ఇచ్చే ఫోర్టిఫైడ్ బియ్యంపై జీఎస్టీ సుంకాన్ని తగ్గించాలన్నారు. ఐజీఎస్టీ సెటిల్‌మెంట్ వ్యవస్థను మరింత పారదర్శకంగా చేపట్టాలని, రాష్ట్రాలకు కూడా డేటా అందుబాటులో

మిగతా 2లో

## నితీశ్, మోడీ సారథ్యంలో బీహార్‌లో ఎన్‌డిఎ పోటీ



న్యూఢిల్లీ : బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, ప్రధాని నరేంద్ర మోడీ సారథ్యంలో న్‌డిఎ వచ్చే ఏడాది రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, బిజెపి నేత సామ్రాట్ చౌదరి ఆదివారం విస్పష్టంగా ప్రకటించారు. ఢిల్లీలో బిజెపి ప్రధాన కార్యాలయంలో విలేకరుల గోష్ఠిలో మాట్లాడుతూ చౌదరి 'గందరగోళం ఏమీ లేదు' అని చెప్పారు. ఎన్నికల్లో నితీశ్‌ను తమ నేతగా ప్రచారం చేయడంపై ఎన్‌డిఎ పునరాలోచించవచ్చునంటూ

మిగతా 2లో


## రేషన్‌కార్డుల జారీకి రెడీ



**హైదరాబాద్:** తెలంగాణలో రేషన్‌కార్డుల దరఖాస్తులకు త్వరలో మోక్షం లభించనుంది. సంక్రాంతి తర్వాత కొత్త కార్డులను జారీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అత్యాధునిక సాంకేతికతో కూడిన ఎలక్ట్రానిక్ చిప్‌తో కూడిన రేషన్ కార్డులను అర్హులకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెలాఖరులోగా కొత్త కార్డుల అర్హతలు, మార్గదర్శకాలు ప్రకటించాలని భావిస్తోంది. సంక్షేమ పథకాలకు రేషన్ కార్డు లింక్ ఉండటంతో కార్డుల మంజూరులో ప్రభుత్వం ఫిర్యాదులకు అవకాశం లేకుండా వ్యవహరించాలని సిద్ధమైంది.తెలంగాణ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల మంజూరు పై కసరత్తు వేగవంతం చేసింది. అత్యాధునిక సాంకేతికతో కూడిన రేషన్ కార్డులను అర్హులకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గత ప్రభుత్వ హాయంలో రెండున్నరేళ్ల క్రితం అప్పుడు దరఖాస్తులను ఆహ్వానించి లబ్దిదారులకు నాటి ప్రభుత్వం రేషన్ కార్డులు మంజూరు చేసింది. ఆ తరువాత తిరిగి అర్హత ఉన్న వారు కొత్త కార్డుల కోసం నిరీక్షిస్తున్నా ఇప్పటి వరకు మంజూరు కాలేదు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు

మిగతా 2లో

## ఇసి సమగ్రతను 'క్రమంగా హరిస్తున్నారు' మోడీ ప్రభుత్వంపై ఖర్గే ఆరోపణ



న్యూఢిల్లీ : ఎలక్ట్రానిక్ పత్రాలు కొన్నిటిని ప్రజలు పరిశీలించకుండా నిరోధించేందుకు ఎన్నికల నిబంధనావళిని మార్చినందుకు ప్రభుత్వాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆదివారం తప్పు పట్టారు, ఎన్నికల కమిషన్ (ఇసి) సంస్థాగత సమగ్రతను ధ్వంసం చేసేందుకు మోడీ ప్రభుత్వం 'విధానపరమైన కుట్ర'లో అది ఒక భాగం అని ఖర్గే ఆరోపించారు. ఇసి సమగ్రతను మోడీ ప్రభుత్వం 'క్రమంగా హరిస్తుండడం' రాజ్యాంగంపైన, ప్రజాస్వామ్యంపైన ముందస్తు దాడి అని కూడా ఖర్గే ఆక్షేపించారు.సిసిటివి కెమెరా, వెబ్‌క్యాస్టింగ్ ఫుటేజ్ వంటి కొన్ని రకాల ఎలక్ట్రానిక్ డాక్యుమెంట్లు, అభ్యర్థుల వీడియో రికార్డింగ్‌ల దుర్వినియోగాన్ని నివారించేందుకు వాటిని ప్రజలు తనిఖీ చేయడాన్ని నిరోధించేందుకు ప్రభుత్వం ఎన్నికల నిబంధనావళిని సవరించింది. ఎన్నికల

మిగతా 2లో

## పథకం ప్రకారమే ముంబై గ్యాంగ్ స్టర్ హత్య

### ఉలిక్కిపడిన పల్లెలు.. లొంగిపోయిన నిందితులు

### ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ, సీఐ

**జగిత్యాల ప్రతినిధి (మన వెలుగు) డిసెంబర్ 22 :**సుపారితో వ్యక్తిని హత్య చేయడానికి పథకం పన్నిన ముంబై గ్యాంగ్ స్టార్ రాహుల్సుర్య ప్రకాష్ సింగ్ (24)సుఫారీ ఇచ్చిన వారి చేతుల్లోనే హత్యకు గురికావడం సంచలనం రేపింది.ప్రశాంతంగా పొలం పనులు చేసుకుంటూ జీవనం గడుపుతున్న పల్లె జనం సమీప అడవి ప్రాంతంలో జరిగిన సుపారి హత్య ఘటన వెలుగులోకి వచ్చేటప్పుటికి ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. ఈ విషయం బయటకు పొక్కడం హత్యకు పాల్పడిన నిందితులు భయపడి జగిత్యాల జిల్లా ధర్మపురి పోలీసుల ఎదుట లొంగిపోయారు. డి.ఎస్పీ. రఘు చందర్ సి ఐ రాంనర్సింహా రెడ్డి. ఆదివారం నిందితులను తీసుకొని హత్య జరిగిన స్థలంతో పాటు శవాన్ని దహనం చేసిన ప్రదేశాన్ని పరిశీలించి ఆధారాలను సేకరించి హత్య జరిగిన తీరును వివరించారు. ధర్మపురి మండలం నేరెళ్ల గ్రామానికి చెందిన మెరుగు లక్ష్మణ్ కమలాపూర్ గ్రామానికి చెందిన నేరెళ్ల గోపాల్ ఇద్దరు మంచి స్నేహితులు. వీరు ముంబైలో కల్లు బిజినెస్ చేస్తున్నారు.ఇటీవల కొంతకాలం నుంచి మెరుగు లక్ష్మణ్ మరదలును నెరేళ్లకు చెందిన తోకల గంగాధర్ అనే వ్యక్తి వేధిస్తున్నాడు.పలుమార్లు హెచ్చరించినా అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈ క్రమంలో గంగాధర్ ను ఎలాగైనా చంపివేసి తన మరదలుకు ప్రశాంతత జీవనం అందించాలని అనుకున్నాడు. ఈ విషయాన్ని తన స్నేహితుడైన నేరెళ్ల గోపాల్ కు వివరించి గంగాధర్ ను చంపడానికి ఎవరితోనైనా మాట్లాడాలని కోరాడు. తనకు తెలిసిన ముంబైకి చెందిన రాహుల్ సూర్య ప్రకాష్ సింగ్ అనే గ్యాంగ్ స్టార్ ఉన్నాడని.అతనికి సుఫారీ ఇస్తేనే హత్య చేయడానికి ఒప్పుకుంటాడని గోపాల్ లక్ష్మణ్ తో అన్నాడు.రూ.4 లక్షల సుఫారి ఇవ్వడానికి లక్ష్మణ్ ఒప్పుకోగా గోపాల్ ఈ విషయాన్ని గ్యాంగ్ స్టార్ రాహుల్ ప్రకాష్ సింగ్ వివరించగా ఆయన డీల్ ఒకే చేశారు. ఇంకేముంది మర్డర్ చేయడానికి డేట్ టైం అన్ని సెట్ చేసుకున్నారు.కాగా ఇంతలోనే కథ అడ్డం తిరిగింది.గ్యాంగ్ స్టార్ సుఫారి డబ్బులు ఇవ్వాలని ఓ రోజు గోపాల్ లక్ష్మణ్ కు ఫోన్ చేశాడు. ఎవరిని హత్య చేయాల్సిన అవసరం లేదని. డబ్బులు ఇవ్వాల్సిన పనిలేదని వీరిద్దరూ గ్యాంగ్ స్టార్ కు తేల్చి చెప్పారు. దీనితో అప్పటి నుంచి గ్యాంగ్ స్టార్ రాహుల్ ప్రకాష్ సింగ్ తనకు డబ్బులు ఇవ్వాల్సిందేనని గోపాల్ కు వార్నింగ్ ఇస్తున్నారు. డబ్బులు ఇవ్వకపోతే మీ తండ్రి రమేష్ ను చంపుతా అంటూ బెదిరిస్తున్నాడు.దీనితో భయందోళనకు గురైన గోపాల్ అతనితో రాజీకుదుర్చు కున్నాడు. డీల్ ప్రకారం మీ సఫారీ ఇచ్చేస్తా ఈనెల 12న నేరేళ్లకు రావాలని కోరగా రాహుల్ వచ్చాడు. 13న అర్ధరాత్రి సమయంలో గోపాల్ నేరేళ్లకు చెందిన గండికోట శేఖర్ తో కలిసి రాహుల్ ను నేరెళ్ల సాంబ శివ గుడి వద్దకు తీసుకెళ్లి అందరూ కలిసి మద్యం సేవించారు.ఈ సమయంలో రాహుల్ ను శేఖర్ మాటల్లో పెట్టగా గోపాల్ పెద్ద బండరా యితో రాహుల్ తలపై మోది హత్య చేశాడు.హత్య చేసిన విషయం వెలుగులోకి రావద్దని ఆలోచనతో శవాన్ని తీసుకొని సమీపంలో ఉన్న బట్ట పెల్లి పోతారం అడవుల్లోకి వెళ్లారు. కట్టెలు పోగేసి శవాన్ని అందులో వేసి పెట్రోలు పోసి కాల్చి వేశారు. శవం పూర్తిగా కాలిందో లేదు అని మరుసటి రోజు నిందితులు అక్కడికి వెళ్లి పరిశీలించి సగం కాలిన శవాన్ని మళ్లీ కట్టెలు వేసి పూర్తిగా దహనం అయ్యాక ఇంటికి వెళ్లారు. ఈ విషయం ఆ నోట ఈ నోట బయటకు పొక్కి పోలీసుల వద్దకు చేరింది.దాంతో పోలీసులు విచారణ ప్రారంభించారు. ఇంతలో నిందితులు నేరెళ్ల గోపాల్





గండికోట శేఖర్ కలిసి రాహుల్ సూర్య ప్రకాష్ సింగ్ తామే హత్య చేశామని ధర్మపురి పోలీస్ స్టేషన్ కు వచ్చి లొంగిపోయారు. దీంతో హత్యకు సంబంధించిన విషయం పూర్తిగా వెలుగులోకి వచ్చింది. దీంతో హత్య జరిగిన స్థలమైన నేరెళ్ల సాంబశివ గుడితో పాటు దహనం చేసిన స్థలాన్ని పరిశీలించినట్లు డీ ఎస్పీ రఘు చందర్ సీఐ రాం నరసింహారెడ్డి తెలిపారు.

మన వెలుగు
MANA VELUGU TELUGU DAILY
సోమవారం 23 డిసెంబర్ 2024

# వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి భారత్, కువైట్ సంబంధాలు



ముబారక్ అల్ కబీర్' కువైట్‌లో రాజపూర్వక గౌరవ పురస్కారం. మైత్రీ చిహ్నంగా దేశ, విదేశీ సార్వభౌమ ప్రభుత్వాధినేతలు, రాజ కుటుంబాల సభ్యులకు దానిని ప్రదానం చేస్తుంటారు. ఇంతకు ముందు ఆ అవార్డును బిల్ క్లింటన్, ప్రిన్స్ చార్లెస్, జార్జి బుష్ వంటి ప్రపంచ నేతలకు ప్రదానం చేశారు. కువైట్‌లో అధికార పర్యటన సందర్భంగా ప్రధాని మోడీకి వైభవోపేత స్వాగతం లభించింది.
ఆయనకు బయన్ ప్యాలెస్‌లో గౌరవ వందనం సమర్పించారు. కువైట్ ఎమీర్ షేఖ్ మెషల్ అల్ అహ్మద్ అల్ జబెర్ అల్ సబాహ్ ఆ కార్యక్రమానికి హాజరయ్యారు. విదేశాంగ మంత్రిత్వశాఖ (ఎంఇఎ) ప్రధాని మోడీ పర్యటన వివరాలను 'ఎక్స్'లో పంచుకుంది. 'చరిత్రాత్మక పర్యటనకు ప్రత్యేక స్వాగతం! వైభవోపేత స్వాగతం, గౌరవ వందనానికి కువైట్‌లో బయన్ ప్యాలెస్ వద్దకు ప్రధాని నరేంద్ర మోడీ వచ్చారు.
కువైట్ ప్రధాని గౌరవనీయ షేఖ్ అహ్మద్ అబ్దుల్లా అల్ అహ్మద్ అల్ సబాహ్ సాదరంగా ఆహ్వానించారు' అని ఎంఇఎ తన ప్రకటనలో తెలిపింది. ప్రధానంగా వర్తక, పెట్టుబడులు, ఇంధన శక్తి రంగాల్లో భారత్, కువైట్ సంబంధాలకు కొత్త ఊపు తీసుకురావడంపై దృష్టి కేంద్రీకరిస్తూ ప్రధాని మోడీ ఆదివారం కువైట్ ఎమీర్ షేఖ్ మెషల్ అల్ అహ్మద్ అల్ జబెర్ అల్ సబాహ్‌తో విస్తృతంగా చర్చలు జరిపారు. షేఖ్ మెషల్ అల్ అహ్మద్ అల్ జబెర్ అల్ సబాహ్ ఆహ్వానంపై ఆ గల్ఫ్ దేశంలో రెండు రోజుల పర్యటన జరుపుతున్నారు. 43 ఏళ్లలో భారత ప్రధాని ఒకరు కువైట్‌ను సందర్శించడం ఇదే ప్రథమం.

# రేషన్‌కార్డుల జారీకి రెడీ

మంజూరుకు నిర్ణయించింది. ఈ మేరకు అర్హుల ఖరారు పైన కీలక నిర్ణయం తీసుకుంది.గ్రేటర్ పరిధిలో రేషన్ కార్డుల దరఖాస్తులు కొన్ని నెలలుగా పెండింగులో ఉన్నాయి. క్షేత్రస్థాయి పరిశీలన తరువాత వారిలో ఎంత మందికి కార్డులు దక్కుతాయన్నది స్పష్టత వస్తుందని అంటున్నారు. సుమారు రెండున్నరేళ్ల కిందట రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించి అర్హులకు కార్డులను జారీ చేసింది. ఆ తర్వాత నుంచి కార్డులు జారీ చేసిన దాఖలాలు లేవు. గతంలో కార్డుల జారీ ప్రక్రియ తరచుగా జరిగేది. రాష్ట్ర ప్రభుత్వం కార్డుల జారీ ప్రక్రియను ఏకీకృతం చేసింది. దీంతో ఎప్పటికప్పుడు కాకుండా ప్రభుత్వం నిర్ణయం మేరకు కార్డులు జారీ చేస్తోంది.
అధికశాతం హైదరాబాద్‌లోనే : రేషన్ కార్డుల కోసం సుమారు 4.5 లక్షల దరఖాస్తులు పెండింగులో ఉన్నట్లు అధికారుల అంచనాలు వేస్తున్నారు. అధిక శాతం హైదరాబాద్ జిల్లా పరిధిలోనే ఉన్నట్లు చెబుతున్నారు. కొత్తగా జారీ చేసే కార్డులో ఎలక్ట్రానిక్ చిప్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయంగా నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఆ చిప్‌లో కార్డుదారుడి కుటుంబ సభ్యుల సంఖ్య, చిరునామా తదితర సమాచారం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. గ్రేటర్‌లోని మూడు జిల్లాల్లో ప్రస్తుతం సుమారు 17.21 లక్షల కార్డులు ఉన్నాయి. పెండింగులో ఉన్న దరఖాస్తుల్లో లక్షన్నర నుంచి రెండు లక్షల వరకు అర్హులు ఉండే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.ఎలక్ట్రానిక్ చిప్‌తో కొత్త రేషన్ కార్డులు : తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే కొత్త రేషన్ కార్డుల పైన ప్రభుత్వం తమ నిర్ణయం వెల్లడించింది. సంక్రాంతి తరువాత కొత్త కార్డులు మంజూరు చేస్తామని స్పష్టం చేసింది. ఇదే సమయంలో అర్హతల ఖరారు పైన తుది కసరత్తు జరుగుతోంది. రేషన్ కార్డుల్లో వినూత్నంగా ఎలక్ట్రానిక్ చిప్స్ తో అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి కొత్త కార్డులను మంజూరు చేయనుంది. రాష్ట్ర ప్రభుత్వం కార్డుల జారీ ప్రక్రియను ఏకీకృతం చేసింది. దీంతో ఎప్పటికప్పుడు కాకుండా ప్రభుత్వం నిర్ణయం మేరకు కార్డులు జారీ చేస్తోంది.రేషన్ కార్డుల కోసం దాదాపు 4.5 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇక, ప్రభుత్వం ఇప్పటికే చేసిన ప్రకటనకు అనుగుణంగా కొత్తగా జారీ చేసే రేషన్ కార్డుల్లో ఎలక్ట్రానిక్ చిప్‌ను ఏర్పాటు చేయనుంది. దీని ద్వారా ఆ చిప్‌లో కార్డుదారుడి కుటుంబ సభ్యుల సంఖ్య తో పాటుగా చిరునామా తదితర సమాచారం ఉండనుంది. అధికంగా గ్రేటర్‌లోని మూడు జిల్లాల్లో ప్రస్తుతం సుమారు 17.21 లక్షల కార్డులు ఉన్నట్లు అధికారుల సమాచారం. ప్రస్తుతం హైదరాబాద్‌లో 6,36,617, రంగారెడ్డిలో 55,97,78, మేడ్చల్‌- మల్కాజ్‌గిరిలో 52,33,39లో కార్డులు ఉన్నాయి.
నిలిచిపోయిన రేషన్‌కార్డుల జారీ : ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం 2018 వరకు రేషన్ కార్డులను జారీ చేసింది. 2018 డిసెంబర్‌లో జరిగిన ముందస్తు అసెంబ్లీ ఎన్నికల అనంతరం మళ్లీ అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ రేషన్ కార్డుల జారీ ప్రక్రియను నిలిపివేసింది. కార్డుల కోసం అనేకమంది దరఖాస్తు చేసుకోగా వాటిని 2022లో పరిశీలించి అందులో అర్హులైన వారికి కొత్త కార్డులను జారీ చేశారు. ఆ తరువాత వెబ్‌సైట్‌ను మూసివేసిన ప్రభుత్వం మళ్లీ రేషన్‌కార్డులు ఇవ్వలేదు. గత ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీ పథకాలతో పాటు కొత్త రేషన్ కార్డులను జారీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది.2023 డిసెంబరు 9వ తేదీ నుంచి ఆరు గ్యారంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, చేయూత పథకంతో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.5 లక్షల నుంచి 10 లక్షలకు వైద్య చికిత్సలు అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలు పథకాలు అమలు చేసేందుకు ప్రజాపాలన గ్రామ, వార్డు సభల్లో ఐదు గ్యారంటీ పథకాలు వర్తింపచేసేందుకు స్వీకరించిన దరఖాస్తులతోపాటు కొత్త రేషన్ కార్డుల కోసం అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. వీటితోపాటు రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా రేషన్ కార్డుల జారీకి మోక్షం కలగలేదు.బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు నిఘా : బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రభుత్వం నిఘా పెంచనుంది. ప్రస్తుతం రేషన్ దుకాణాల్లో దొడ్డ బియ్యం ప్రభుత్వం అందిస్తోంది అయితే చాలా మంది వీటిని తినకుండా బయట మార్కెట్లో విక్రయిస్తున్నారు. కొంతమంది ఈ బియ్యాన్ని తక్కువ ధరకు సేకరించి అధిక ధరకు ఇతరులకు విక్రయిస్తున్నారు. దీంతో ప్రభుత్వం పేదల కోసం అందించే బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఈనేపథ్యంలో పేదలందరూ తినేందుకు వీలుగా సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తే ఈ పరిస్థితి ఉండదని ప్రభుత్వం భావిస్తోంది. ఎన్నికల సమయంలోనే తాము అధికారంలోకి వస్తే సన్నబియ్యం పంపిణీ చేస్తామని హామీ ఇచ్చింది. ఇప్పుడు హామీ అమలు చేసేందుకు వేగంగా ఏర్పాట్లు చేస్తోంది.సంక్రాంతి తర్వాత కొత్త రేషన్ కార్డులు అందచేస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇప్పటికే స్పష్టం చేశారు. కొత్తగా దాదాపు 36 లక్షల మందికి రేషన్‌కార్డులను ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు వెల్లడించారు. కార్డుల జారీకి కేబినెట్ సబ్ కమిటీసూచనలను పరిగణలోకి తీసు కుంటున్నామని చెప్పారు.రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్నబియ్యం అందించే ఏర్పాట్లు జరుగుతున్నాయని, ప్రస్తుతం లబ్దిదారులకు అందిస్తున్న ఆరు కిలోల బియ్యంతోపాటు సన్నబియ్యం కూడా అందించాలని నిర్ణయించినట్లు వివరించారు. రాష్ట్రంలో లక్షలాది మంది కొత్త రేషన్ కార్డుల కోసం చాలా ఏళ్లుగా ఎదురుచూస్తున్నారని, పజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను పరిశీలించి త్వరలోనే కొత్త రేషన్ కార్డుల జారీకి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. 36 లక్షల కార్డులు ఇచ్చే విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని, అర్హత ఉన్నవారిని గుర్తించి వారికి మాత్రమే కార్డులు మంజూరు చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# మేము అల్లుఅర్జున్ కు వ్యతిరేకం కాదు: డిజిప





హైదరాబాద్: మేము హీరో అల్లుఅర్జున్ కు వ్యతిరేకం కాదని తెలంగాణ డీజీపీ జితేందర్ అన్నారు. ఈ ఘటనలో చట్ట ప్రకారం చర్యలు తీసుకున్నామని ఆయన చెప్పారు. ఆదివారం కరీంనగర్ లోని భరోసా సెంటర్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న డీజీపీ జితేందర్.. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనపై స్పందించారు. థియేటర్ లో తొక్కిసలాట జరగడం దురదృష్టకరమని అన్నారు. ఆయన సినీ హీరో కావొచ్చు.. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితిని అర్థం చేసుకోవాలన్నారు.“సినిమా హీరోలైనా.. బయట పౌరులే.. ఎవరు తప్పు చేసినా చట్ట ప్రకారం చర్యలు తప్పవు.. మాకు ప్రజల భద్రతే ముఖ్యం అని చెప్పారు. పోలీసులు వ్యక్తిగతంగా ఎవరికీ వ్యతిరేకం కాదని.. ప్రజల భద్రత కంటే.. మూవీ ప్రమోషన్స్ ముఖ్యం కాదు” పేర్కొన్నారు.

**మహిళ చనిపోయిందని అల్లు అర్జున్ కు చెప్పినా పట్టించుకోలేదు: ఎసిపి**

సంధ్య థియేటర్ ఘటనపై పోలీసులు వీడియో విడుదల చేశారు. బయట తొక్కిసలాటలో మహిళ చనిపోయిందని నటుడు అల్లు అర్జున్‌కు చెప్పేందుకు ప్రయత్నించారని చిక్కడపల్లి ఎసిపి రమేష్ తెలిపారు. దయచేసి థియేటర్ నుంచి వెళ్లిపోండి అని అల్లు అర్జున్ మేనేజర్ డిసిపి వెళ్లి చెప్పినా కూడా పట్టించుకోలేదన్నారు. అల్లు అర్జున్ వద్దకు తమను వెళ్లనివ్వలేదన్నారు. అతి కష్టం మీద వాళ్లను నెట్టుకుంటూ అల్లు అర్జున్ వద్దకు వెళ్లానని ఎసిపి తెలిపారు. తొక్కిసలాటలో మహిళ చనిపోయిందని బాలుడి పరిస్థితి విషమంగా ఉందని అల్లు అర్జున్ కు చెప్పానని, కానీ సినిమా మొత్తం చూశాకే వెళ్తానని అల్లు అర్జున్ చెప్పాడని ఎసిపి పేర్కొన్నారు. బౌన్సర్లకు సిపి సివి ఆనంద్ సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. పబ్లిక్‌ను ఎక్కడైనా తోసివేస్తే తాటతీస్తామన్నారు. బౌన్సర్ల తీరుకు సెలబ్రిటీలదే బాధ్యత అని సిపి హెచ్చరించారు.

# ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకే ప్రతిపక్షాల రాద్ధాంతం : టీపీసీసీ చీఫ్

నిజామాబాద్ : తొక్కిసలాటలో ఒక నిరుపేద మహిళ చనిపోతే లేని బాధ%ొ% సినిమా రంగంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కు ఎందుకంత ప్రేమ అని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. అల్లు అర్జున్ పై అసెంబ్లీలో సీఎం వివరణ సమంజసమేనని అన్నారు.
ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ%ొ% సినీ పరిశ్రమపై మాకు కూడా ప్రేమ ఉంది..
కానీ ప్రజల ప్రాణాలు ముఖ్యమని అన్నారు.
ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కృషి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకే ప్రతిపక్షాలు రాద్దాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. తొక్కిసలాటలో ఓ మహిళ చనిపోయి ఆమె కొడుకు చావు బతుకుల మధ్య ఉంటే దానిపై బీజేపీ, బీఆర్ఎస్ ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సినీ వర్గం నుంచి చిరంజీవికి కేంద్రమంత్రి పదవి ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని తెలిపారు. సినీ పరిశ్రమను మద్రాస్ నుంచి హైదరాబాదు రావడానికి ప్రధాన కారణం కాంగ్రెస్ పార్టీ అని చెప్పారు.పద్మాలయ, రామానాయుడు స్టూడియోలకు కాంగ్రెస్ ప్రభుత్వం భూములు ఇచ్చి చిత్ర పరిశ్రమను ప్రోత్సహించిందన్నారు. మాకు ఏ వ్యక్తులపై ద్వేషాలు ఉండవు.. ప్రభుత్వానికి అంత సమానమేనని అన్నారు.

## జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో కీలక సూచనలు చేసిన ఏపీ ఆర్థికమంత్రి పయ్యావుల

ఉండేలా చూడాలని కోరారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలో భాగంగా జీఎస్టీ రిజిస్ట్రేషన్లను మరింత సులభతరం చేసేందుకు టెక్నాలజీని వినియోగించుకోవాలని, అలాగే బోగస్ రిజిస్ట్రేషన్లను అరికట్టాలని తెలిపారు. చిన్న వ్యాపారస్తులు.. కంపోజిషన్ జీఎస్టీ చెల్లింపు దారులకు అద్దెల విషయంలో విధించే రివర్స్ ఛార్జ్ మెకానిజం (ఆర్సీఎం) నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. కీలకాంశాలపై ఏపీ సీఎం చంద్రబాబు తీసుకుంటున్న చొరవను జీఎస్టీ కౌన్సిల్లో పయ్యావుల ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాష్ట్రానికి ఏం కావాలో వివరిస్తూనే .. వివిధ రంగాల్లో జీఎస్టీ కౌన్సిల్ అనుసరించాల్సిన విధానాలకు సంబంధించి పయ్యావుల ఇచ్చిన కీ నోట్ ప్రసంగానికి ఇతర రాష్ట్రాల ఆర్థిక శాఖ మంత్రులు ప్రశంసించారు. ఏపీతో సహా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన సూచనలను పరిశీలించేందుకు జీఎస్టీ కౌన్సిల్.. క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. తాను చేసిన సూచనలపై వెంటనే కేబినెట్ సబ్ కమిటీ వేసినందుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతా రామన్‌కు పయ్యావుల ధన్యవాదాలు తెలిపారు. మంత్రి పయ్యావుల కేశవ్ వెంట జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఏపీ ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్, కమర్షియల్ ట్యాక్స్ చీఫ్ కమిషనర్ అహ్మద్ బాబు పాల్గొన్నారు.

## నితీశ్, మోడీ సారథ్యంలో బీహార్‌లో ఎన్‌డిఎ పోటీ

సాగుతున్న ఊహాగానాలపై వ్యాఖ్యానించవలసిందని మీడియా అడిగినప్పుడు ఆయన ఆ స్పష్టీకరణ ఇచ్చారు. ఇటీవల ఒక వార్తా చానెల్‌తో ఇంటర్వ్యూలో కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు చౌదరి ఆ విధంగా స్పందించారు.మహారాష్ట్రలో ఇటీవల విజయవంతంగా వ్యవహరించిన రీతిలోనే ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించకుండానే బీహార్‌లో ఎన్నికలకు ఎన్‌డిఎ వెళుతుందా అని అమిత్ షాను అడిగారు. బిజెపి మాజీ అధ్యక్షుడు, పార్టీ ప్రధాన వ్యూహకర్తగా ఇప్పటికీ పరిగణిస్తున్న అమిత్ షా కొద్ది విరామం అనంతరం సమాధానం ఇస్తూ, 'మేము కలసి కూర్చొని నిర్ణయిస్తాం. మేము నిర్ణయం తీసుకున్నప్పుడు మీకు తెలియజేస్తాం' అని చెప్పారు. 2025 ఎన్నికల్లో నితీశ్‌ను సిఎం అభ్యర్థిగా ప్రకటించరాదని బిజెపి పట్టుబట్టవచ్చుననే ఊహాగానాలకు ఆ సమాధానం తావు ఇచ్చింది.చౌదరి ఆ ఊహాగానాలను తోసిరాజంటూ, 'ఎన్‌డిఎ బీహార్‌లో నితీశ్ కుమార్, ప్రధాని నరేంద్ర మోడీ సారథ్యంలో పని చేస్తోంది. ఆ ఇద్దరు నేతల నాయకత్వంలో మేము ఎన్నికల్లో పోటీని కొనసాగిస్తాం' అని తెలియజేశారు. '2020లో మేము (నితీశ్‌ను ఎన్ఎడి సిఎం అభ్యర్థిగా ప్రకటించిన తరువాత పోటీ చేశాం. ఇప్పటి వరకు మేము ముఖ్యమంత్రిగా నితీశ్ కుమార్‌నే పరిగణిస్తున్నాం. భవిష్యత్తులో కూడా మేము నితీశ్ కుమార్, నరేంద్ర మోడీ నాయకత్వంలో ఎన్నికల్లో పోటీ చేస్తాం' అని బీహార్ ఉప ముఖ్యమంత్రి చౌదరి స్పష్టం చేశారు. 243 మంది సభ్యులు ఉన్న బీహార్ శాసనసభకు 2025 ద్వితీయార్ధంలో ఎన్నికలు జరగవలసి ఉంది.

## రాహుల్‌కు బరైలీ కోర్టు సమన్లు ఆర్థిక సర్వేపై వ్యాఖ్యల పర్యవసానం

బరైలీ (యుపి) : లోక్‌సభ ఎన్నికల సమయంలో ఆర్థిక సర్వేకు సంబంధించి చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ ఎంపి, లోక్‌సభలోని ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జనవరి 7న తమ ముందు హాజరు కావాలంటూ బరైలీలో ఒక న్యాయస్థానం ఆయనకు సమన్లు జారీ చేసింది. జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి సుధీర్ కుమార్ శనివారం రాహుల్‌కు నోటీస్ జారీ చేశారు. అఖిల భారత హిందు మహాసంఘ్ మండల అధ్యక్షుడు పంకజ్ పాఠక్ దాఖలు చేసిన పిటిషన్‌పై సమన్లు జారీ చేయడమైంది. రాహుల్‌పై ఒక కేసు నమోదు చేయాలనే అభ్యర్థనతో పాఠక్ తొలుత ఆగస్టులో ఎంఎల్ఎఎంపి కోర్టు/ సిజెఎం కోర్టును ఆశ్రయించారు. అయితే. కోర్టు ఆగస్టు 27న ఆ అభ్యర్థనను తిరస్కరించింది.దీనితో పాఠక్ సెషన్స్ కోర్టులో రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌ను పురస్కరించుకునే రాహుల్‌కు సమన్లు జారీ అయ్యాయి. 'బలహీన వర్గాల శాతం అధికంగా ఉన్నప్పటికీ వారి ఆస్తుల శాతం బాగా తక్కువగా ఉన్నది. ఈ పరిస్థితే కొనసాగినట్లయితే అధిక జనాభా ఉన్నవారు మరిన్ని ఆస్తులు కోరగలరు' అని రాహుల్ లోక్‌సభ ఎన్నికల సమయంలో ఆరోపించినట్లు పాఠక్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న న్యాయవాది వీరేంద్ర పాల్ గుప్తా పిటిషన్‌లో వాదించారు. రాహుల్ ఆ వ్యాఖ్యలతో బలహీన వర్గాలను రెచ్చగొట్టే యత్నం చేశారని, ఆ వ్యాఖ్యల లక్ష్యం 'రాజకీయ లబ్ధి కోసం వర్గ విద్వేషం సృష్టి' అని గుప్తా ఆరోపించారు.

## ఇసి సమగ్రతను 'క్రమంగా హరిస్తున్నారు'

కమిషన్ సిఫార్సు ఆధారంగా కేంద్ర న్యాయ మంత్రిత్వశాఖ ప్రజల తనిఖీకి కొన్ని రకాల 'పత్రాల' లేదా డాక్యుమెంట్ల అందుబాటును పరిమితం చేయడానికి ఎన్నికల ప్రవర్తన నిబంధనావళి 1961లోని 93(2)(ఎ) నిబంధనను శుక్రవారం సవరించింది. ఆ పరిణామానికి ఖర్గే స్పందిస్తూ, 'ఎన్నికల ప్రవర్తన నిబంధనావళిని మోడీ ప్రభుత్వం మొండితనంతో సవరించడం భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) సంస్థాగత సమగ్రత నాశనానికి విధానపరమైన కుట్రలో మరొక దాడి' అని ఆరోపించారు.'ఇంతకు ముందు వారు ఎన్నికల కమిషనర్లను నియమించే ఎంపిక కమిటీలో నుంచి భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ)ని తొలగించారు. ఇప్పుడు హైకోర్టు ఉత్తర్వు తరువాత కూడా ఎన్నికల సమాచారాన్ని అడ్డుకోవడానికి వారు పూనుకున్నారు' అని ఖర్గే విమర్శించారు. వోటర్ల పేర్ల తొలగింపు, ఇవిఎంలలో పారదర్శకత లోపం వంటి నిర్దిష్టమైన ఎన్నికల అక్రమాల విషయంలో ఇసిఐకి కాంగ్రెస్ లేఖ రాసినప్పుడల్లా ఇసిఐ స్పందన దిగజారినట్లుగా ఉంది, కొన్ని తీవ్ర ఫిర్యాదులను కనీసం గుర్తించనూ లేదు' అని ఖర్గే ఆరోపించారు. 'ఇసిఐ పాక్షిక న్యాయవ్యవస్థ అయినప్పటికీ స్వతంత్రంగా వ్యవహరించడం లేదని ఇది మరొకసారి రుజువు చేస్తోంది' అని ఆయన పేర్కొన్నారు. ఇసిఐ సమగ్రత పరిరక్షణకు తాము అన్ని చర్యలూ తీసుకుంటామని ఖర్గే తెలిపారు. ఆ సవరణను తమ పార్టీ చట్టపరంగా సవాల్ చేస్తుందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్ ఇన్‌చార్జి) జైరామ్ రమేష్ తెలియజేశారు.

## తెనాలిలో స్పోర్ట్స్ స్టేడియం ఏర్పాటు చేస్తున్నాం: మంత్రి నాదెండ్ల

క్రీడలను ప్రోత్సహిస్తూ తెనాలిలో సువిశాలమైన స్టేడియంను నిర్మించనున్నామని ఏపీ ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. 1.76 ఎకరాల మున్సిపల్ భూమిని సేకరించి రూ. 3 కోట్ల అంచనాతో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడతామని వెల్లడించారు. అందులోనే వాలీబాల్, బాస్కెట్ బాల్ కోర్టులతో పాటు స్విమ్మింగ్ పూల్ కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.పట్టణ అభివృద్ధి కోసం మంచి ప్రణాళిక సిద్ధం చేయబోతున్నామని తెలిపారు. ప్రధాన రహదారుల విస్తరణ, మెరుగైన వైద్య సదుపాయాలు, రక్షిత మంచినీటి పథకం ద్వారా నీటి సరఫరా, తెనాలి కళాకారుల సంస్కృతి తదితర అంశాలను ప్రాథమికంగా తీసుకుని తెనాలి పట్టణాన్ని అభివృద్ధి నిర్మాణంలో నడిపిస్తామని నాదెండ్ల వివరించారు. తెనాలి పట్టణ పరిధిలో రోడ్ల విస్తరణతో పాటు నిఘా కెమెరాలు ఏర్పాటుపై పరిశీలిస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంత రోడ్ల అభివృద్ధికి రూ.25 కోట్లు మంజూరు చేశారన్నారు. ఇందులో భాగంగా తెనాలి-కొల్లిపర సీసీ రోడ్లు అభివృద్ధి చేయబోతున్నామన్నారు. రూ 20 లక్షలతో చినారావూరు పార్క్ ను మరమ్మత్తులు చేపట్టి డిసెంబర్ 30 నాటికి సుందరీకరణ చేయబోతున్నామని, రూ 1.15 కోట్లతో తెనాలి ఐతానగర్ లో ఐకర్స్ పార్క్ నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు. సంక్రాంతి పండగలోపు దుగ్గిరాల, మంగళగిరి రోడ్డు మరమ్మత్తులు పూర్తి చేస్తామని చెప్పారు.

## రాష్ట్ర అభివృద్ధికి వెన్నెముక సింగరేణి : డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్ : సింగరేణి కాలరీస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డిప్యూటీ సీఎం, ఇంధనశాఖ మంత్రి భట్టి విక్రమార్క సింగరేణి కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తి ద్వారా రాష్ట్ర, దేశ ఇంధన అవసరాలను తీర్చడంలో సింగరేణి సంస్థ కీలక పాత్ర పోషిస్తూ రాష్ట్రానికి తలమానికంగా నిలుస్తోందన్నారు.
రాష్ట్ర అభివృద్ధికి సింగరేణి వెన్నెముకగా నిలుస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. తెలంగాణలోని ఆరు జిల్లాల్లో లక్షల మంది ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనాధారంగా ఉన్న సింగరేణిని కేవలం బొగ్గు ఉత్పత్తికే పరిమితం చేయకుండా ఇతర రంగాల్లోకి కూడా ప్రవేశించి మరింత విస్తరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. సింగరేణి సంస్థ సుస్థిర భవిష్యత్ కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, శ్రమశక్తిని చాటుతూ సంస్థను అగ్రగామిగా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ పునరంకితమవాలని ఆయన కోరారు.

## ఈ చరిత్ర ఎందరికి తెలుసు....

## బిజెపి జనతా పార్టీలో కలవకముందు

## జనసంఘ్‌గా ఉండేది



**మధోల్ (మన వెలుగు) డిసెంబర్ 22 :**జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామాప్రసాద ముఖర్జీ. శ్యామా ప్రసాద్, డాక్టర్ అంబేద్కర్లు నెహ్రూ మంత్రి వర్గంలో సహచరులు. వీరిద్దరూ మంచి మిత్రులు.ఇద్దరూ నెహ్రూ విధానాలతో విభేదించారు. ఇద్దరూ పదవిని తృణప్రాయం గా వదిలేశారు. కశ్మీర్ మీద నెహ్రూ నిర్ణయాలను శ్యామా ప్రసాద్ తో పాటు అంబేద్కర్ కూడా వ్యతిరేకించారు.శ్యామా ప్రసాద్, అంబేద్కర్ ఇద్దరూ విద్యాధికులు, మేధావులు. వారు ఈ దేశానికి కాంగ్రెస్ పాలన మేలు చేయదని ప్రకటించారు.ప్రథమ లోక్సభ ఎలక్షన్స్ లో నెహ్రూ తన పనిమనిషిని పెట్టి అంబేద్కర్ గారిని ఓడించిన తర్వాత... జన సంఘం పార్టీ పశ్చిమ బెంగాల్ నుంచి రాజ్యసభకు పంపినది.ఆనాటి అంబేద్కర్ ఆశయాలను జనసంఘ్ నేత పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ "అంత్యోదయ" అనే సిద్ధాంతంగా మలచారు. మోదీజీ ఇపుడు ఆ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఒక ప్రభుత్వ పథకం ఏదైనా ఉంటే అది ఢిల్లీలో ఉన్నవాడికీ, అండమాన్స్ అడవుల్లో ఉన్న వాడికీ ఒకే రోజు అందాలనేది సూక్ష్మంగా అంత్యోదయలో ఒక నిర్ణయం.అంబేద్కర్‌కి బిజెపికి సంబంధం ఏమిటని వ్యాఖ్యానించే వాళ్లు ముఖ్యమంత్రులుగా ఉండటం దౌర్భాగ్యంద

## కుటుంబ కలహాలతో భర్త ఓరి వేసుకొని ఆత్మహత్య.



**ముధోల్ (మన వెలుగు) డిసెంబర్ 22 :** దుంపల లక్ష్మణ్ వయస్సు 30 సంవత్సరాలు గుడిసెర గ్రామానికి చెందిన అను అతనికి ప్రమీల అనే ఆమెతో పెళ్లి జరిగినది అతనికి ఇద్దరు ఆడపిల్లలు సంతానం కలరు గత కొంతకాలంగా లక్ష్మణులకు మరియు అతని భార్య ప్రమీలకు గొడవలు జరుగుతున్నది ఇట్టే గొడవల కారణంగా ప్రమీల మూడు నెల క్రితం పిల్లలను తీసుకొని ఆమె పుట్టినిల్లు మైలాపూర్ బాసరకు వెళ్ళినది అప్పటినుండి లక్ష్మణ్ అతని భార్య సంసారానికి రావడం లేదని మనస్థాపానికి గురి అయ్యి నిన్న ఉదయం అతని తల్లిదండ్రులు మరియు ఫిర్యాదు రాలు అయినా బండారి లక్ష్మి పొలం పనులకు వెళ్లి ఇంటికి వచ్చి వంట చేసుకుని తిని తన అన్న అయినా లక్ష్మన్ను భోజనానికి పిలవడానికి తలుపులు నెట్టగా ఇంటి లోపల నుండి గడియ వేసి ఉన్నది తన అన్నను డోర్ తీయమని పిలిచినప్పటికీ అతను తలుపులు తీయకపోయే సరికి కిటికీలోంచి చూడగా ఆమె అన్న ఇంటి పైకప్పు ఇనుప దూలానికి ఉరివేసుకొని చనిపోయి ఉన్నాడు . ఆమె అన్న భార్య ప్రమీల సంసారానికి రావడంలేదని మనస్తాపం చెంది ఉరివేసుకొని చనిపోయినాడని దరఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించనైనది.

## చెక్కులను లబ్ధిదారులకు పంపిణి

## ఏటూరునాగారం మండల కాంగ్రెస్ పార్టీ

## నాయకులు



**ములుగు ప్రతినిధి ( మన వెలుగు ) డిసెంబర్ 22 :**మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు, జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనల మేరకు ఏటూరు నాగారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు ఆధ్వర్యంలో ములుగు జిల్లా,ఏటూరునాగారం మండల కేంద్రానికి చెందిన వెన్న శంకర్ కు 32 వేల 5 వందలు మరియు రామన్నగూడెం గ్రామానికి చెందిన అల్లి సతీష్ కు 29 వేల గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, పిఎస్సిఎస్ వైస్ చైర్మన్ చెన్నూరి బాలరాజు, మాజీ ఎంపీటీసీ కోడి రాంగోపాల్,మాజీ సర్పంచ్ చేల వినయ్ కుమార్, బ్లాక్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వసంత శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు గద్దల నవీన్, గ్రామ కమిటీ అధ్యక్షులు గార మహేష్, పడిదాల సారయ్య, పెద్ది రాజు కుమార్,బొల్లె ఆదినారాయణ, తోట సమ్మయ్య, అల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమిక బాలికల వసతి గృహం లేకపోవడం

**- ఎస్ఎఫ్ఐ యూనియన్ నాయకులు సందర్శించడం జరిగింది**

**- సంబంధిత అధికారులు నిర్లక్ష్యం**

**ముధోల్ (మన వెలుగు) డిసెంబర్ 22 :**భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ)ముధోల్ నియోజకవర్గం కమిటీ ఆధ్వర్యంలో ముధోల్ పట్టణకేంద్రంలో లోని ఉన్నటువంటి సాంఘిక సంక్షేమ వసతి గృహానికి సందర్శించిన ఎస్ఎఫ్ఐ నిర్మల్ జిల్లా ఉపాధ్యక్షులు గడపాలి పరమేష్ ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గడపాలే పరమేష్ మాట్లాడుతూ: బడుగు బలహీన వర్గాల విద్యార్థులు చదువుకునే సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు లేకపోవడం చాలా బాధాకరమైన విషయం ఇప్పుడున్న ప్రైవేటు బంగ్లాలో 70 మంది విద్యార్థులకు రూమ్లు లేకపోవడం మరియు సరైన వసతులు లేకపోవడం చాలా బాధాకరమైన విషయం వారి వార్డెన్ మేడం విద్యార్థులు అసంతృప్తి ఉన్నారు ఎందుకంటే రెండు మూడు రోజులకు ఒకసారి వచ్చి పోతుందని విద్యార్థులు తెలిపారు ఆహారం యొక్క నాణ్యతను పెట్టాలని విద్యార్థులు కోరారు ఈ కార్యక్రమంలో నితిన్ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు అభినందనలతో ఎస్ఎఫ్ఐ నిర్మల్ జిల్లా ఉపాధ్యక్షులు గడపాలి పరమేష్



# ఆన్లైన్లో నమోదు కానీ ఇంద్రమ్మ లబ్ధిదారులు

**ఆందోళన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై చర్యలు తీసుకోండి**

**ముధోల్ (మన వెలుగు) డిసెంబర్ 22 :**రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీల కోసం లబ్ధిదారుల నుండి దరఖాస్తులను తీసుకుంది. లబ్ధిదారులు ప్రజాపాలన దరఖాస్తులను పూర్తి చేసి స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయాలతో పాటు మండల పరిషత్ కార్యాలయంలో సైతం సమర్పించారు. ఇటీవలే ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదలకు ఇంద్రమ్మ పథకం ద్వారా ఇంటి నిర్మాణానికి సాయం అందిస్తామని ప్రకటించింది. అదేవిధంగా లబ్ధిదారుల గుర్తింపు సర్వేను సైతం యుద్ధ ప్రాతిపదికన చేపడుతుంది. ప్రత్యేకంగా తయారు చేసిన యాప్ ద్వారా లబ్ధిదారుల వివరాలను నమోదు చేసుకుంటున్నారు. ప్రజా పాలన దరఖాస్తులో ఇంద్రమ్మ గృహాల కోసం సైతం లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. సర్వే బృందం సభ్యులు లబ్ధిదారుల ఇంటికి వచ్చిన తర్వాత ఇంద్రమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకోలేదని రావడంతో ఒక్కసారిగా ఆందోళనకు గురవుతున్నారు.

తాము దరఖాస్తు సమర్పించే సమయంలోనే ఇంద్రమ్మ గృహం కోసం సైతం ఇచ్చిన ఫారంలో టిక్కు చేయడం జరిగిందని సర్వే బృందం సభ్యులకు రసీదులను సైతం చూపెడుతున్నారు. అయితే తాము యాప్ లో ఉన్న వారి వివరాలను మాత్రమే నమోదు చేసుకుంటామని తెలపడంతో లబ్ధిదారులు అసహన వ్యక్తం చేస్తున్నారు. లబ్ధిదారుల వివరాలు ఆన్లైన్లో నమోదు చేసే సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే తాము అర్హులుగా ఉండి ఇంద్రమ్మ పథకాన్ని కోల్పోవలసి వస్తుందని పేర్కొంటున్నారు. ఆన్లైన్లో వివరాల నమోదులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఉన్నత అధికారులను ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వం గతంలో విద్యుత్తు, గ్యాస్ కోసం ఎడిట్ ఆప్షన్ ఇచ్చినట్లుగానే ఇంద్రమ్మ లబ్ధిదారులకు సైతం అవకాశాన్ని ఇవ్వాలని కోరుతున్నారు. లేనియెడల అర్హులైన లబ్ధిదారులు ఇంద్రమ్మ పథకానికి దూరం కావలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గతంలో తాము చేసిన దరఖాస్తులను పరిశీలించి తమకు సైతం వివరాలు నమోదు చేసుకునే అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో శివకుమార్ ను వివరణ కోరగా యాప్ లో ఉన్న వారి వివరాలను మాత్రమే నమోదు చేసుకుంటున్నామని లేని వారి వివరాలను నమోదు చేసుకోవడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం నుండి తదుపరి ఆదేశాలు వచ్చిన తర్వాత వివరాలు లేని లబ్ధిదారులకు సమాచారం అందించడం జరుగుతుందన్నారు. ఎవరు సైతం ఆందోళనకు గురికావద్దని పేర్కొన్నారు.






# కలెక్టరేట్ లో అధికారికంగా వెంకటస్వామి వర్ధంతి.



**ములుగు ప్రతినిధి (మన వెలుగు) డిసెంబర్ 22 :**కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి వర్ధంతిని పురస్కరించుకుని ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టరేట్ కార్యాలయంలో ఆదివారం అధికారికంగా వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కలెక్టరేట్ సూపర్ఇండెంట్ తహసిల్దార్ క్యాడర్ శ్రీనివాస్ కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ, సుదీర్ఘ కాలం పాటు కేంద్ర మంత్రిగా, పార్లమెంటు సభ్యునిగా ప్రాతినిధ్యం వహించిన వెంకటస్వామి దళిత, బడుగు, బలహీన, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం విశేషంగా కృషి చేశారని కొనియాడారు. ఆయన సేవలను గుర్తిస్తూ నిరంతరం స్మరించుకునేలా ప్రభుత్వం అధికారి కంగా జయంతి, వర్ధంతి వేడుకలను నిర్వహిస్తోందని అన్నారు.వర్ధంతి కార్యక్రమంలో కలెక్టరేట్, ఆర్డీఓ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

# అపార్ట్మెంట్స్ అసోసియేషన్ సమావేశంలో పాల్గొన్న హమీద్ పటేల్



**శేర్లింగంపల్లి (మనవెలుగు) డిసెంబర్ 22 :**కొండాపూర్ డివిజన్ పరిధిలోని మాదాపూర్ లోని డిఎస్ఆర్ ఫార్చునర్ అపార్ట్మెంట్స్ అసోసియేషన్ సభ్యులు ఏర్పాటు చేసిన సమావేశంలో వారి ఆహ్వానం మేరకు కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ హమీద్ పటేల్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ సభ్యులు పలు సమస్యలు కార్పొరేటర్ హమీద్ పటేల్ దృష్టికి తీసుకోని రావటం జరిగింది. గతంలో చాలా సంవత్సరాల నుండి ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను హమీద్ పటేల్ దృష్టికి తీసుకోని రాగానే, అప్పటికప్పుడు సత్వర చర్యలు తీసుకోని, పరిష్కారించారాని అసోసియేషన్ సభ్యులు ఈ సందర్బంగా కార్పొరేటర్ హమీద్ పటేల్ కి గుర్తు చేసి, వారికీ అభినందనలు తెలియయజేసి, సత్కరించారు. ఈ సందర్బంగా కార్పొరేటర్ హమీద్ పటేల్ మాట్లాడుతూ, చేసిన కృషిని గుర్తించి, అభినందనలు తెలియజేసిన డిఎస్ఆర్ ఫార్చునర్ అసోసియేషన్ సభ్యులకు పేరు పేరునా ధన్యవాదములు తెలియజేశారు. ఇప్పుడు దృష్టికి తీసుకోని వచ్చిన పలు సమస్యలు పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి సత్వరమే పరిష్కరిస్తామని అసోసియేషన్ సభ్యులకు తెలియజేశారు.కార్పొరేటర్ హమీద్ పటేల్ తో బాటుగా సీనియర్ నాయకులు కావూరి రాజేశ్వర్ రావు, ఏరియా కమిటీ సభ్యులు కుమ్మరి సిల్వర్ శ్రీనివాస్,యూత్ నాయకులు అబ్దుల్ వసీమ్, డిఎస్ఆర్ ఫార్చునర్ అసోసియేషన్ అధ్యక్షులు బాలా గంగాధర్ రెడ్డి, రవి రాజు, రవీందర్ నాథ్ రెడ్డి, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మన వెలుగు
MANA VELUGU TELUGU DAILY



# సిబ్బందిని సన్మానించిన ఎమ్మెల్యే గాంధీ




**శేర్లింగంపల్లి (మన వెలుగు) డిసెంబర్ 22 :**కొండాపూర్ డివిజన్ పరిధిలోని గోల్డెన్ తులిప్ ఎస్టేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, పిఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ , కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ హమీద్ పటేల్ చేతుల మీదుగా జీహెచ్ఎంసీ, హెచ్ ఎం డబ్ల్యూ ఎస్, ఎలక్ట్రికల్ శాఖలలో పని చేస్తున్న సిబ్బందికి మెమంటోలు ప్రధానం చేసి,శాలువాతో సన్మానం చేసి, వారు చేస్తున్న సేవలను అభినందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ హమీద్ పటేల్ మాట్లాడుతూ, చేస్తున్న పనికి తగిన గుర్తింపు, ప్రోత్సాహం ఉండాలని, గోల్డెన్ తులిప్ ఎస్టేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు ఈ యొక్క బహుత్తరమైన సన్మాన సత్కార కార్యక్రమం చేపట్టి, ప్రజల కోసం కష్టపడుతున్న జీహెచ్ఎంసీ, హెచ్ ఎం డబ్ల్యూ ఎస్, ఎలక్ట్రికల్ సిబ్బందికి నూతన ఉత్తేజాన్ని కల్పించారని అన్నారు. మన కోసం పని చేసే వారిని గుర్తించి, అభినందించటం, సత్కారించటం అనేది గొప్ప విషయమని అన్నారు. ఈ విషయంలో గోల్డెన్ తులిప్ ఎస్టేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారిని మనస్ఫూర్తిగా వారికీ అభినందనలు తెలియజేస్తూన్నానని అన్నారు. గుర్తింపు పొందిన ఎవరైనా కూడా చేసే పని పట్ల మరింత అంకిత భావంతో, శ్రద్ధతో పని చేస్తారని అన్నారు. అలాగే సిబ్బందిని ఉద్దేశించి ఈ యొక్క కార్యక్రమంతో మరింత బాధ్యత మీ పై పెరిగిందని, మీ పనిలో మీరు కష్టపడి పైకి రావాలని, అందరి మన్ననలు పొందాలని కోరుకుంటున్నానని కార్పొరేటర్ హమీద్ పటేల్  అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ హమీద్ పటేల్ తో బాటుగా గోల్డెన్ తులిప్ ఎస్టేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కే. విద్యాసాగర్ రెడ్డి, యన్ రేవతి, ఎస్ వి యన్ రాజు, కే. శివ కుమార్ రాజు, సీ. సుధాకర్ రెడ్డి, డి. శ్రీకృష్ణ, బీ. గిరిధర్, ఏం. రాకేష్, ప్రొఫెసర్ రామారావు, ప్రొఫెసర్ శ్రీనివాస్, ప్రతాప్ రెడ్డి, రమాకాంత్, రాకేష్,విజయ్ శర్మ, యువ నాయకులు కచ్చావ్ దీపక్, హెచ్ ఎం డబ్ల్యూ ఎస్  సీవరాజ్ ఇంచార్జి శ్రీకాంత్, జిహెచ్ఎంసి ఎస్ఆర్పీ రాజయ్య, స్ట్రీట్ లైట్ ఎలక్ట్రికల్ ఇంచార్జి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# చరిత్రలో నిలిచిపోనున్న శీతాకాల పార్లమెంటు సమావేశాలు

ఘాటైన విమర్శలు, తోపులాటలు, గాయాలు.. చరిత్రలో నిలిచిపోనున్న శీతాకాల పార్లమెంటు సమావేశాలు

పార్లమెంటు శీతాకాల సమావేశాలు డిసెంబర్ 20, శుక్రవారం నాటితో ముగిశాయి, లోక్‌సభ, రాజ్యసభ రెండూ నిరవధికంగా వాయిదా పడ్డాయి. ఈసారి తీవ్ర నిరసనలు, దాడి ఆరోపణలు, ఏకకాలంలో ఎన్నికలు శాసనసభ ఒత్తిడితో కూడిన గందరగోళ కాలానికి ముగింపు పలికింది. అలాగే చివరి క్షణంలో 'ఒక దేశం, ఒకే ఎన్నికలు' రాజ్యాంగ సవరణ బిల్లులను జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి సూచించే తీర్మానాన్ని లోక్‌సభ ఆమోదించింది .

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు అలా ముగిశాయి. విపక్షాల ఆందోళనలతో నెల రోజులు ఉభయసభలు అట్టుడికాయి. కానీ నెల రోజులంతా ఒక ఎత్తైతే.. గురువారం జరిగిన తంతు మరో ఎత్తు. 16 బిల్లులు ప్రవేశపెట్టాలని కేంద్రం భావించింది. ఓవైపు రాజ్యాంగంపై పదునైన ప్రసంగాలు.. అదానీ వ్యవహారంపై ఘాటైన విమర్శలు.. మధ్యలో తోపులాటలు.. గాయాలు.. ఇలా సాగిన వింటర్ సెషన్స్ ఎట్టకేలకు ముగిసింది.పార్లమెంట్ శీతాకాల సమావేశాలు అనూహ్య ఘటనలకు వేదికయ్యాయి. దాదాపు నెల రోజులపాటు జరిగిన సమావేశాల్లో పలు అంశాలపై అధికార విపక్షాల మధ్య తీవ్ర సంవాదం నడిచింది. ఆందోళనల పర్వం కొనసాగింది. పదునైన సంభాషణలకు వేదికైంది. చివరి రోజైన శుక్రవారం కూడా ఉభయ సభల్లో గందరగోళ పరిస్థితులే కనిపించాయి. అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీలు నినాదాలు చేశారు. ఇటు లోక్‌సభలోనూ ఇదే పరిస్థితి కనిపించడంతో%%%పార్లమెంటు గౌరవాన్ని, సభలో శాంతిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్క సభ్యుడిపైనా ఉందని సభ్యులను శాంతపరిచే ప్రయత్నం చేశారు స్పీకర్ ఓంబిర్లా. సభలో జాతీయ గీతాలాపన పూర్తయిన వెంటనే సభను వాయిదా వేస్తున్నట్టు ఆయన ప్రకటించారు. ఇటు రాజ్యసభలో వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీజేపీసీకి పంపేందుకు ఆమోదముద్ర పడింది.

నవంబర్ 15 నుంచి ప్రారంభమైన శీతాకాల సమావేశాల్లో అనేక కీలకపరిణామాలు చోటు చేసుకున్నాయి. అదానీ వ్యవహారంపై విపక్షసభ్యుల ఆందోళనలతో సభ అట్టుడుకుంది. దాదాపు 14రోజుల పాటు అదానీ వ్యవహారంపైనే రచ్చ జరిగింది. దీంతో ఉభయసభల విలువైన సమయం వాయిదాలకే సరిపోయింది. ఇక పార్లమెంట్ చరిత్రలో తొలిసారి రాజ్యసభ చైర్మన్ పై విపక్షాలు అవిశ్వాస తీర్మాన నోటీస్ ఇచ్చాయి. చైర్మన్ జగదీప్ ధన్‌కడ్‌పై విపక్షాల గొంతును నొక్కేస్తున్నారని ఆరోపిస్తూ..ఇండి కూటమి నో కాన్ఫిడెన్స్ మోషన్ ఇచ్చింది. అయితే నో కాన్ఫిడెన్స్ మోషన్‌కు మూవ్ అయ్యేందుకు తగినంత సమయం లేకపోవడం, డాక్యుమెంట్ లోపాలతో సహా విధానపరమైన సమస్యల కారణంగా నో కాన్ఫిడెన్స్ మోషన్ తిరస్కరించబడింది. ఇక అదానీ గ్రూప్ లంచం ఆంరోపణలపై విపక్షాలు విరుచుకుపడుతుంటే.. రివర్స్‌లో సోరోస్ గాంధీ బంధం గురించి ఏమంటారంటూ అధికార పక్షం ఎదురుదాడికి దిగింది.ఇలా అధికార విపక్షాల ఆందోళనలతో ప్రతిరోజూ ఉభయసభల్లో గందరగోళ పరిస్థితులు నెలకొనేవి. అయితే రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75ఏళ్లు అవుతున్న సందర్భంగా పార్లమెంట్ లో రెండురోజుల పాటు చర్చ జరిగింది. ఈ రెండ్రోజులు సభ్యులు పూర్తిగా హాజరై రాజ్యాంగంపై తమ అభిప్రాయాలతో పాటు పదునైన ప్రసంగాలు చేశారు. రాజ్యాంగ చర్చలోఅధికార విపక్షాల పరస్పర ఆరోపణలతో సభ వేడెక్కింది. ఇక ఎంతో ఉత్కంఠ రేపిన జమిలీ బిల్లును సభముందుకు తీసుకొచ్చింది మోదీ సర్కార్. దీనిపై విపక్షాలు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేసినా కేంద్రం వెనక్కి తగ్గలేదు. బిల్లును



క్షుణ్ణంగా పరిశీలించేందుకు పరిశీలించేందుకు ఓటింగ్ ద్వారా జేపీసీకి పంపేందుకు ఆమోదముద్ర పడింది.ఇక అంబేద్కర్‌పై అమిత్‌షా రాజ్యసభలో చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. అంబేద్కర్‌ను అమిత్‌షా అవమానించారంటూ విపక్షాలు దేశవ్యాప్తంగా నిరసనప్రదర్శనలకు పిలుపునిచ్చింది. అమిత్‌షా రాజీనామా చేయాలని.,.జాతికి క్షమాపణ చెప్పాలంటూ విఫక్షాలు భారీ స్థాయిలో ఆందోళనలు చేపట్టాయి. అయితే తాను అంబేద్కర్‌ను అవమానించలేదని కేంద్రమంత్రి అమిత్‌షా వివరణ ఇచ్చారు.

అమిత్‌షా వివరణ ఇచ్చినా విపక్షాలు మాత్రం శాంతించలేదు. ఈనెలరోజుల పాటు జరిగన ఆందోళనలు ఓ ఎత్తైతే%%%గురువారం జరిగిన ఆందోళనలు మరోఎత్తు. అమిత్ షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష ఇండి కూటమి ఎంపీలు బ్లూకలర్ దుస్తులు, కండువాలతో ఆందోళనకు దిగారు. అంబేద్కర్ ప్లకార్డులు పట్టుకుని అమిత్ షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ, ప్రియాంక, ఇతర ఎంపీలు పార్లమెంటు ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం వద్దకు వెళ్లి ఆందోళన చేశారు. జై భీమ్ నినాదాలు చేశారు. మరోవైపు, బీజేపీ నేతృత్వంలోని ఎన్ డీఏ ఎంపీలు సైతం ప్లకార్డులు పట్టుకుని బాబా సాహెబ్‌ను అవమానించిన కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని నిరసనకు దిగింది.ఇలా పోటాపోటీ ఆందోళనలతో పార్లమెంటు ఆవరణలో తీవ్ర గందరగోళం ఏర్పడింది. పార్లమెంటు మకరద్వారం వద్ద గోడపైకి ఎక్కి విపక్ష సభ్యులు నిరసన తెలిపారు. ఈసందర్భంలోనే అధికార విపక్షాలు ఎదురుపడడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సభ్యుల మధ్య ఒక్కసారిగా తోపులాట చోటు చేసుకుంది. ఈతోపులాటలో ఒడిశా బీజేపీ ఎంపీ ప్రతాప్ చంద్ర సారంగి తలకు గాయమైంది. రాహుల్ గాంధీ నెట్టడంతోనే తాను పడ్డానని సారంగి తెలిపారు. మెట్ల వద్ద నిల్చొని ఉండగా.. రాహుల్ గాంధీ ఓ ఎంపీని నెట్టేశారు. ఆయన వచ్చి తనపై పడటంతో కిందపడి గాయపడ్డానని సారంగి తెలిపారు. ఈ తోపులాటలో మరో ఎంపీ ముకేశ్ రాజ్‌పుత్‌కూ గాయాలయ్యాయి. వెంటనే సారంగితోపాటు ముకేశ్‌నూ ఆసుపత్రికి తరలించారు.ప్రస్తుతం ఇద్దరు ఎంపీలు ఆసుపత్రిలోనే వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. మరోవైపు బీజేపీ ఎంపీల ఆరోపణలను రాహుల్ గాంధీ, ఖర్గే తీవ్రంగా ఖండించారు. పార్లమెంట్ లోపలికి వెళ్లనీయకుండా బీజేపీ ఎంపీలు తమను అడ్డగించారని..కర్రలతో తమను బెదిరించేందుకు ప్రయత్నించారని రాహుల్ ఆరోపించారు. ఇటు బీజేపీ ఎంపీలు కూడా కాంగ్రెస్ తీరుపై తీవ్ర ఆరోపణలతో విరుచుకుపడ్డారు. ముఖ్యంగా పార్లమెంట్‌లో రాహుల్ ఓ గూండాలా ప్రవర్తించారని మహిళా ఎంపీలపైనా ఆయన దురుసుగా ప్రవర్తించినట్లు బీజేపీ మహిళా ఎంపీలు ఆరోపించారు. మేము శాంతియుతంగా నిరసన తెలుపుతున్న సమయంలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ మావైపు దూసుకొచ్చారు. మాకు అతి దగ్గరగా వచ్చి నినాదాలు చేయడం మొదలుపెట్టాడు. మమ్మల్ని బెదిరిస్తున్నట్టుగా అతని వ్యవహరించిన తీరు మాకు చాలా ఇబ్బంది కలిగించింది. ముఖ్యంగా మహిళా ఎంపీల దగ్గర రాహుల్ ప్రవర్తించిన తీరు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. ఓ ఎంపీ..తోటి సభ్యుల పట్ల గౌరవంగా ఉండాలి. ఈరోజు ఇలా జరగడం చాలా బాధాకరంగా ఉంది. అందుకే ఈవిషయంపై రాజ్యసభ చైర్మన్‌కు ఫిర్యాదు చేశామని బీజేపీ ఎంపీలు తెలిపారు.నాగాలాండ్ ఎంపీ ఫాంగ్నాన్ చివరిరోజు రాజ్యసభలో కన్నీరు పెట్టుకుని రాహుల్ తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఓ మహిళా సభ్యురాలి పట్ల అభ్యంతరంగా ప్రవర్తించడం దారుణమంటూ ఆవేదన వ్యక్తం చేయడంతో రాజ్యసభ చైర్మన్ ఆమెను సముదాయిస్తూ..జరిగిన ఘటనను పరిశీన లో ఉందని తెలిపారు. మరోవైపు చివరిరోజు కూడా కాంగ్రెస్ ఆందోళనలు కొనసాగాయి. కేంద్ర హెూంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని, అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం విపక్ష సభ్యులు విజయ్ చౌక్ నుండి పార్లమెంటుకు పాదయాత్ర చేశారు. అయితే పార్లమెంట్ ప్రాంగణంలోనే పోటాపోటీ నిరసనలు చేపట్టడమే కాకుండా ఒకర్నొకరు గాయాలు చేసుకునే రీతిలో ఎంపీలు ఘర్షణకు దిగడం దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది.

దేశ అత్యున్నత చట్ట సభ అయిన పార్లమెంట్ ప్రాంగణంలో హుందాగా ఉండాల్సిన ఎంపీలు ఇలా పరస్పరం తోసుకుని గాయాలపాలవ్వడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. దీనిపై సీరియస్ అయిన లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇకపై పార్లమెంట్ గేట్ వద్ద ఎలాంటి నిరసనలు చేయకుండా నిషేధాజ్ఞలు జారీ చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీలను హెచ్చరించారు లోక్‌సభ స్పీకర్

## కరెంట్ షాక్ తగిలి వ్యక్తి మృతి




**మెట్ పల్లి (మన వెలుగు) డిసెంబర్ 22 :**జంతువుల వేటకని వెళ్లి కరెంట్ షాక్ తో వ్యక్తి మృతి చెందిన ఘటన జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో చోటు చేసుకుంది. ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం...ఇబ్రహీంపట్నం మండలం రాజేశ్వర్రావ్ పేట గ్రామానికి చెందిన జంగిటి నవీన్(32) అనే వ్యక్తిని అదే గ్రామానికి చెందిన జంగిటి చిన్న నరసయ్య అలియాస్ ఇచ్చన్న అనే వ్యక్తి వచ్చి శనివారం రాత్రి జంతువుల వేటకు తీసుకెళ్లాడు.గ్రామ శివారులోని మహాజన్ వెంకటేశ్వర్ కు చెందిన మామిడి తోటలో అడవి పందులకు అమర్చిన కరెంట్ పెన్సింగ్ వైర్లకు తగిలి నవీన్ మృతి చెందాడు. మృతుని భార్య జంగిటి రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ నిరంజన్ రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపారు.

## డిసెంబరు 21 పగలు 8 గంటలు మాత్రమే.!

## రాత్రి 16 గంటలు..

శీతాకాలపు అయనాంతం ఏర్పడే రోజున సూర్యుని నుండి భూమికి దూరం ఎక్కువగా ఉంటుంది. అలాగే చంద్రకాంతి భూమిపై ఎక్కువ కాలం ఉంటుంది. శీతాకాలపు అయనాంతం ఏర్పడిన రోజున భూమి దాని ధ్రువం వద్ద 23.4 డిగ్రీల వంపులో ఉంటుంది. ఈ సహజ మార్పు కారణంగా 2024, డిసెంబరు 21న ఈ ఏడాదిలో అత్యంత తక్కువ పగలు, సుదీర్ఘమైన రాత్రి ఏర్పడుతుంది. భూమి దాని అక్షం మీద తిరిగే సమయంలో దక్షిణ అర్ధగోళంలో భూమి నుండి సూర్యుడి దూరం గరిష్టంగా ఉన్న రోజున అయనాంతం వస్తుంది. ఇది శీతాకాలంలో ఏర్పడుతున్నందున దీనిని శీతాకాలపు అయనాంతం అని అంటారు.శీతాకాలపు అయనాంతం ఏర్పడే తేదీ ప్రతీయేటా మారుతుంటుంది. అయితే అది డిసెంబర్ 20 నుంచి 23 తేదీల మధ్యనే వస్తుంటుంది. డిసెంబర్ 21న భూమికి సూర్యునికి గరిష్ట దూరం ఉండటం వల్ల సూర్యకిరణాలు ఆలస్యంగా భూమిని చేరుతాయి. ఈ కారణంగా ఉష్ణోగ్రతలో స్వల్ప తగ్గుదల కూడా కనిపిస్తుంది. వివిధ దేశాల్లో శీతాకాలపు అయనాంతం రోజున ఉత్సవాలు జరుపుకుంటారు. చైనాతో పాటు ఇతర తూర్పు ఆసియా దేశాలలో, బౌద్ధమతంలోని యిన్, యాంగ్ శాఖకు చెందిన ప్రజలు శీతాకాలపు అయనాంతం ఐక్యత, శ్రేయస్సును అందించే రోజుగా భావిస్తారు. శీతాకాలపు అయనాంతంపై వివిధ దేశాల్లో వేర్వేరు నమ్మకాలున్నాయి. శీతాకాలపు అయనాంతం వచ్చినప్పుడు ఉత్తర భారతదేశంలో శ్రీ కృష్ణునికి నైవేద్యం సమర్పించి, గీతా పారాయణం చేస్తారు. రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాలలో పుష్యమాస పండుగ ను జరుపుకుంటారు. సూర్యుని ఉత్తరాయణం ప్రక్రియ శీతాకాలపు అయనాంతం నుండి మొదలవుతుంది. అందుకే భారతదేశంలో దీనికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది.

## మధ్యతరగతికి మళ్లీ జీఎస్టీ బాదుడు.. ఈ వస్తువులపై ట్యాక్స్ పెంపు!

**న్యూఢిల్లీ:** జీఎస్టీ సమావేశం ప్రారంభమైంది. ఇందులో పలు వస్తువులపై జీఎస్టీ పెరగనుంది. దీంతో మధ్య తరగతి ప్రజలకు మరింత భారం కానుంది. ఈ జీఎస్టీ పెంపుతో వివిధ రకాల వస్తువుల ధరలు పెరగనున్నాయి. ఈ సమావేశానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్
%జీఎస్టీ కౌన్సిల్ 55వ సమావేశం జైసల్మేర్‌లో జరిగింది. ఈ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకోవచ్చని భావిస్తున్నారు. ఈ సమావేశానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షత వహించారు. మీరు పాత కారును విక్రయించాలని ఆలోచిస్తున్నట్లయితే, మీకు ఇప్పుడు పెరుగుదల ఉంటుంది. వినియోగించిన వాహనాల విక్రయంపై ప్రభుత్వం జీఎస్టీ రేటును పెంచడంతో పాటు టిక్కెట్లు కొనుగోలు చేయడమే కాకుండా పాప్‌కార్న్ కొనుగోలుకు కూడా ఎక్కువ డబ్బు చెల్లించాల్సి ఉంటుంది.ఫోర్టిఫైడ్ రైస్‌పై పన్ను విధానాన్ని సరళీకృతం చేసి, దానిపై 5% జీఎస్టీ విధించాలని జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయించింది. అదే సమయంలో రెడీ-టు-ఈట్ పాప్‌కార్న్‌పై పన్ను రేట్ల గురించి పూర్తి వివరాలు విడుదలయ్యాయి. సాధారణ ఉప్పు, సుగంధ ద్రవ్యాలతో తయారుచేసిన పాప్‌కార్న్‌పై ప్యాకేజింగ్, లేబుల్ లేకుండా 5% జీఎస్టీ వసూలు చేయనున్నారు. అదే సమయంలో ప్యాకేజింగ్, లేబులింగ్ చేసేటప్పుడు రేటు 12% ఉంటుంది. చక్కెర వంటి పంచదార పాప్‌కార్న్‌ను "స్వీట్ డిష్" విభాగంలో ఉంచారు. 18% జీఎస్టీకి లోబడి ఉంటుంది.ఎలక్ట్రిక్ వాహనాలతో సహా పాత, ఉపయోగించిన వాహనాల విక్రయాలపై జీఎస్టీ రేటు 12% నుండి 18% కి పెరిగింది. అయితే బీమా విషయంలో నిర్ణయం తీసుకోవడం ప్రస్తుతానికి వాయిదా పడింది. ఈ విషయంపై %+శీవీ% సమావేశం అంగీకరించలేదు. తదుపరి పరిశీలన కోసం పంపించారు.వివిధ వస్తువులపై పన్ను రేట్లను హేతుబద్ధీకరించాలని %+ూవీ% సిఫార్సు చేసింది. హానికరమైన పానీయాలు, పొగాకు ఉత్పత్తులపై పన్ను రేటును 28% నుంచి 35%కి పెంచాలని ప్రతిపాదించింది. అదేవిధంగా దుస్తులపై ప్రతిపాదిత కొత్త రేట్లు ఈ కింది విధంగా ఉండనున్నాయి.

రూ.1,500 నుండి రూ.10,000 వరకు వస్త్రాలపై 18% జీఎస్టీ.

రూ.10,000 కంటే ఎక్కువ విలువైన బట్టలపై 28% జీఎస్టీ

రూ.1,500 పైబడిన షూస్, రూ.25,000 పైబడిన వాచీలపై పన్ను రేటును 18% నుంచి 28%కి పెంచాలని సిఫార్సు చేసింది.నిత్యావసర వస్తువులపై పన్ను భారాన్ని తగ్గించాలని కూడా జిఓఎం సిఫార్సు చేసింది. ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ (20 లీటర్లు లేదా అంతకంటే ఎక్కువ)పై జీఎస్టీని 18% నుంచి 5%కి తగ్గించాలని ప్రతిపాదించారు. అదనంగా, రూ. 10,000 కంటే తక్కువ ఉన్న సైకిళు ,, క్యాన్సర్ ఔషధాలపై జీఎస్టీ రేట్లను 12% నుండి 5%కి తగ్గించాలని సిఫార్సు చేసింది.

ఇప్పటికే నివేదిక రూపొందించి జీఎస్టీ కౌన్సిల్ కి అందజేసిన మంత్రుల బృందం.. కుటుంబం మొత్తం కవర్ చేసే "టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్" కు జీఎస్టీ మినహాయింపు ఇవ్వాలని మంత్రుల బృందం సూచించింది. అలాగే వయో-వృద్ధుల మెడికల్ ఇన్సూరెన్స్ పాలసీల పై కూడా జీఎస్టీ మినహాయింపు ప్రతిపాదించింది మంత్రుల బృందం.మిగతా అన్ని హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీల పై జీఎస్టీ స్లాబ్ ను 18% నుంచి 5% కు తగ్గించాలని సిఫార్సు చేసింది. రేపటి సమావేశంలో మెడికల్, లైఫ్ ఇన్సూరెన్స్ లపై జీఎస్టీ పన్ను రేట్ల సవరణ, మినహాయింపులపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అలాగే ఏటీఎఫ్ (ఎయిర్ ఫ్యూయల్) ను జీఎస్టీ పరిధిలోకి తెచ్చే అంశంపై కూడా చర్చించింది జీఎస్టీ కౌన్సిల్.

## ఉత్తరాఖండ్‌లో విరిగిపడిన భారీ కొండచరియలు.. అల్లకల్లోలంగా మారిన ప్రాంతం

భారీ కొండచరియలు విరిగిపడితే ఎంత విధ్వంసం చోటు చేసుకుంటుందో ఎప్పుడైనా చూశారా? కనీసం టీవీలో వీడియో అయినా చూశారా? భారీగా ఉన్న కొండలు అంత ఎత్తు నుంచి కూలి పడిపోతే ఎంత భయానకంగా ఉంటుందో అసలు ఊహించలేం. తాజాగా ఉత్తరాఖండ్ రాష్ట్రంలో అదే జరిగింది. ధార్చులలోని తవాఘాట్ సమీపంలోని హైవేపై అకస్మాత్తుగా పెద్ద కొండచరియలు విరిగిపడడంతో ఆ ప్రాంతం అల్లకల్లోలంగా మారింది.ఉత్తరాఖండ్ ధార్చులలోని తవాఘాట్ సమీపంలోని హైవేపై ఉన్న పెద్ద కొండలో కొంత భాగం పగుళ్లు వచ్చి రోడ్డుపై పడిపోయింది. కొండచరియలు విరిగిపడటంతో ఇరువైపులా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విరిగిపడుతున్న రాళ్ల భాగాలు, మట్టితో ఆ ప్రాంతమంతా భయంకర వాతావరణం నెలకొంది. ఈ రహదారి చైనా సరిహద్దును కలుపుతుంది. ఉవ్వెతున ఎగిసిపడుతున్నట్లుగా కొండలో ఒక వైపు భాగం నుంచి కొంత విరిగిపడడం మనం చూడొచ్చు. ఇలాంటి ఎత్తైన కొండలు ఉన్న ప్రాంతంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి.

లేదంటే ప్రాణాలకే ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంటుంది. అయితే.. భారీ కొండచరియ విరిగిపడుతున్నప్పుడు కొందరు ఆ దృశ్యాలను తమ సెల్ ఫోన్లలో చిత్రీకరించారు. విషయం తెలుసుకున్న  బృందం వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుంది.

## ఎడిటోరియల్

# సమ భావం!



%రెండువేల ఏళ్లనాటి మనువాదం ఇప్పటికీ భారతీయ సమాజాన్ని ఏదో ఒక రూపంలో పీడిస్తూనే వుంది. 'స్త్రీ ఎప్పుడూ తండ్రి, భర్త, కొడుకు సంరక్షణలోనే వుండాలని, వేధించి హింసించే భర్తను కూడా పూజించాలి' అనే పురుషాధిక్య భావజాలాన్ని ఆధునిక యుగంలోనూ చలామణీ చేసేందుకు మనువాదులు యత్నిస్తున్నారు. దానికి నిదర్శనమే నేటికీ కొనసాగుతోన్న లింగ వివక్ష. స్త్రీ పట్ల సమాజం ఎంత అమానవీయంగా ప్రవర్తిస్తోందో తెలుపుతూ%ౌ% 'నువ్వు ఆడదానివి, గీత దాటకూడని దానివి, మచ్చపడితే మాయని దానివి' అంటుందని చెబుతారు అబ్బూరి ఛాయాదేవి. ఈ మచ్చలు, గీతలు స్త్రీలకే గాని పురుషులకు లేవంటుందీ సమాజం. ఈ సమాజంలో అమ్మాయిలకు అడుగడుగునా అవరోధాలే.. వారి కదలికలపై ఎన్నో ఆంక్షలు, నిర్బంధాలు. పాప-బాబు, అమ్మాయి-అబ్బాయి, మహిళ-పురుషుడు అన్న ఈ పదాల మధ్య గీతలు చెరిపేసి, సమానం అని చెప్పాలనుకున్నా, పురుషాధిపత్య భావజాలం ఏదోఒక రూపంలో మొలకెత్తుతూనే వుంది. ఇంట్లో కనీసం ఒక్క మగపిల్లాడైనా వుండాలని కోరుకునే భావన బలంగా వేళ్లూనుకుని వుంది. అమ్మాయిలైతే పెళ్లి తర్వాత అత్తవారింటికి వెళ్లిపోతారు, అదే అబ్బాయిలైతే వృద్ధాప్యంలో తమ బాగోగులు చూసుకుంటారని, తమకు ఆదరువుగా వుంటారని కొందరు తల్లిదండ్రులు భావిస్తుంటారు. కానీ, కొడుకు కంటే కూతురే నయమని అనుభవం చెబుతోంది.

సమాజం అన్ని రంగాల్లోనూ మారుతున్నా%ౌ% అమ్మాయిలు- అబ్బాయిల పెంపకం విషయంలో మాత్రం పెద్దగా మార్పు చోటుచేసుకోలేదు. 'వాడికేం? మగమహారాజని/ ఆడా, మగా వాగినప్పుడే అర్థమైపోయింది/ పెళ్లంటే పెద్ద శిక్ష అని/ మొగుడంటే స్వేచ్ఛా భక్షకుడని/ మేం పాలిచ్చి పెంచిన జనంలో సగమే/ మమ్మల్ని విభజించి పాలిస్తోందని' అంటారు సావిత్రి. ఈ తరహా విభజన ప్రాథమిక పాఠ్యాంశాల నుంచి సాహిత్యం వరకూ, సీరియళ్ల నుంచి సినిమాల వరకూ అబ్బాయిలకు ప్రాధాన్యతనివ్వడం చూస్తూనే వున్నాం. విద్యలోనూ వివక్షతే. మగపిల్లలను బయట చదువులకు పంపించే తల్లిదండ్రులు%ౌ% ఆడపిల్లలను పంపడానికి సంకోచిస్తారు. ఎవరో ఒకరినే చదివించాల్సిన పరిస్థితివుంటే%ౌ% అబ్బాయిలకే ప్రాధాన్యతనిస్తారు. పిల్లల పుట్టుక దగ్గర నుంచి పెంపకం వరకూ ఈ వివక్ష అడుగడుగునా కొనసాగుతూనే వుంది. గర్భంలో ఉన్నది ఆడపిల్ల అని తెలిస్తే పిండ దశలోనే అంతమొందిస్తున్నారు. 'జనాభా లెక్కల్లో స్త్రీలకంటే పురుషుల సంఖ్యే ఎక్కువ' అని కేంద్ర ప్రభుత్వం గత వందేళ్లుగా నిర్వహించిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే నివేదికలు చెబుతున్నాయి. ఇదంతా పురుషాధిపత్య భావజాల ఫలితమే. 'భ్రష్టుడా! / అమ్మ రుణం తీరదురా/ అమ్మకు అమ్మవై పుడితే తప్ప' అంటారు ఆచార్య గోపి. ఈ మార్ధవం అబ్బాయిల్లో జీర్ణించుకునేలా పెంచడం తల్లిదండ్రుల బాధ్యత.

అమ్మాయి, అబ్బాయి సమానమేనన్న భావన ఇంటి నుంచి, చిన్న వయసు నుంచే మొదలవ్వాలి. అది తల్లిదండ్రుల బాధ్యత. ఇంటర్నెట్ యుగంలో%ౌ% సోషల్‌మీడియా, ఏఐ వంటి మాధ్యమాలు అందుబాటులో వున్న నేపథ్యంలో టీనేజ్ పిల్లల భావోద్వేగాలను నిశితంగా గమనిస్తుండాలి. ఒకవైపు కార్పొరేటీరణ, మరోవైపు మనువాదం నేర్పిన సనాతనధర్మం పురుష మెదళ్లలో చెత్తలా పేరుకుపోతోంది. ఈ చెత్తను తొలగించే బాధ్యత ఇంట్లో తల్లిదండ్రులది, పాఠశాలలో ఉపాధ్యాయులది. ఇంట్లో తల్లిని, చెల్లినీ గౌరవించడం నేర్పాలి. బయటి స్త్రీలకు కూడా అంతే గౌరవ మర్యాదలివ్వాలి. పాఠ్యాంశాల్లోనూ అమ్మాయి-అబ్బాయి సమానమన్న భావన పాదుకొల్పాలి. ఆ దిశగా అబ్బాయిలను పెంచాలి. వారి మానసిక వికాసానికి తోడ్పడాలి. వంట చేయడం, ఇల్లు తుడవడం వంటివి కేవలం అమ్మాయిల పని మాత్రమే కాదు, అబ్బాయిలూ నేర్వాలన్న విజ్ఞత తల్లిదండ్రులే నేర్పాలి. 'అన్ని బాధ్యతల్నీ సమానంగా పంచుకునే మనం/ మన బరువు దించేందుకు చేయందించరేమని నిలదీయాలి/ మన పిల్లల నుంచైనా/ ఇంటి పనంటే ఇంతులది కాదని నేర్పాలి/ అమ్మాయిలతో పాటు అబ్బాయికీ అంట్లు తోమడం అలవాటు చేయాలి' అంటారు పాటిబండ్ల రజని. అబ్బాయిల పెంపకంలో ఈ తరహా మార్పు అవసరం.

# అంబేద్కర్‌కు అవమానం, పార్లమెంటుకు గ్రహణం

దేశంపై తన నిరంకుశాధిపత్యాన్ని రుద్దడానికీ, ప్రత్యక్ష పరోక్ష పద్ధతులలో ప్రత్యర్థులపై, ప్రతిపక్షాలపై దాడి చేయడానికి మోడీ ప్రభుత్వం ఎంత దూరమైనా పోవడానికి సిద్ధంగా వుందని ఈ వారం రోజుల పార్లమెంటు సమావేశాలు హెచ్చరిస్తున్నాయి. ఆఖరుకు ముందుగా అనుకున్న దానికన్నా ముందే అర్థంతరంగా ఏకపక్షంగా వాటిని ముగించి, కీలక చర్చలన్నిటికీ మంగళం పాడటం వ్యూహాత్మకంగా జరిగిందే. అటు రాజ్యాంగానికి ఎసరు పెడుతూ రాజకీయ రభస రగిలించడమే గాక భౌతికంగా ఇటు రాష్ట్రాలలోనూ రాజధానిలోనూ బిజెపి సంఘ పరివార్ ప్రయోగిస్తున్న పాచికలు ఇన్నీ అన్నీ కావు. బడా మీడియా, అనేక కీలక ప్రాంతీయ పార్టీలూ వంత పాడుతున్నాయి గనక సామాన్య ప్రజలకు వీటి తీవ్రత అందకుండా పోతున్నది. ఒకదానికి ఒకటి అడ్డం పెడుతూ అనుకున్న దిశలో బండి నడిపించుకోవడానికి బిజెపి, ఎన్‌డిఎ భాగస్వాములను కూడా మద్దతుదారులుగా మార్చుకుంటున్నది. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పార్లమెంటు వేదికపై అడ్డుకోవడాలు, అఘాయిత్యాలు జరిగినా తెలుగు రాష్ట్రాల్లో కీలక ప్రాంతీయ పార్టీలు నోరు మెదపకపోవడం ఇందుకో ఉదాహరణ మాత్రమే. తెలుగుదేశం, జనసేన నేరుగా ఎన్‌డిఎలో వుండి బలపరుస్తుంటే వైసిపి బయటి నుంచి తోడు నిలుస్తున్నది. బిఆర్‌ఎస్ అటూ ఇటూ కాకుండా కాంగ్రెస్, బిజెపి ఒకటేననే వింత వాదనతో పరోక్షంగా సహకరిస్తున్నది. ప్రాంతీయ ప్రత్యర్థుల మధ్యనే ప్రదక్షిణలు చేస్తున్న తెలుగు మీడియా జాతీయ స్థాయి చర్చలో స్పష్టమైన కోణాలను చూపించకుండా రాష్ట్ర రాజకీయాల స్థాయికి దించేస్తున్నది. అందుకే ఇది తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేకించి లోతుగా చర్చించాల్సి వుంది.

ఈ సమావేశాలు మొదలవడానికి ముందే అదానీ భాగోతం అమెరికాలో భగ్గుమన్నది. మోడీ నుంచి జగన్ వరకూ విస్తరించిన ఈ వ్యవహారంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం కూడా ప్రస్తావ-నకు వచ్చింది. ఈ అంశం చర్చకు చేపట్టాలని ప్రతిపక్షాలు ఎంతగా పట్టుపట్టినా పోరాడినా మొండిగా నిరాకరించిన బిజెపి కుయుక్తులతో రాజ్యాంగ ఏర్పాటు 75వ వార్షికోత్సవాల ప్రహసనం చేపట్టి ప్రవచనాలు గుప్పించింది. నెహ్రూపై ద్వేష పూరితమైన వ్యాఖ్యలతో విషం కక్కింది. అదానీపై చర్చను పక్కదోవ పట్టించడం కోసం జార్జి సోరోస్ కథనం తీసుకొచ్చి సోనియా గాంధీ కాంగ్రెస్‌లతో పాటు లౌకిక పక్షాలు కూడా ఆయన తరపున పని చేస్తున్నారని దుష్ప్రచారానికి దిగింది. గతంలో సమాంతర మీడియాపై దాడికి కూడా ఇదే వాదన చేయడం గుర్తుండి వుంటుంది. ఏతావాతా సోరోస్‌తో చేతులు కలిపి భారత దేశానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు కుట్ర చేస్తున్నాయనేది సంఘ పరివార్ అల్లుతున్న అబద్ధపు పురాణం. అదే నిజమైతే పదేళ్లుగా అప్రతిహత అధికారం చలాయిస్తున్నవారు ఎందుకు శోధించి బయటికి తీయలేకపోయారు? న్యూస్ క్లిక్, వైర్ వంటి వాటికి అండగా వున్న సింగం చైనా ఏజంటంటూ ఇదే ప్రచారం చేశారు గాని చివరకు చెప్పిందేమీ లేదు. ఇప్పుడు తామే చైనాతో సాధారణ సంబంధాలకు చొరవ తీసుకున్నారు. దేశద్రోహులుగా ప్రతిపక్షాలపై ముద్ర వేయడం ఒక పథకం ప్రకారం సాగుతున్న కుట్ర. సిపిఎం సభ్యుడు జాన్ బ్రిట్టాస్ రాజ్యసభలో దీనిపై చక్కటి చురక వేశారు. నెహ్రూ వ్యతిరేక ప్రచారం కోసం ఒక ప్రత్యేక మంత్రిత్వ శాఖనే ఏర్పాటు చేస్తే పోతుందని ఆయన అన్నారు. మాజీ ప్రధాని వాజ్‌పేయి స్వయంగా రాజ్యసభలో ఒకప్పుడు నెహ్రూను రాముడితో పోల్చారని అలాంటి నెహ్రూ ఇప్పుడు రావణుడై పోయాడని వ్యాఖ్యానించారు. కేరళలో నంబూద్రిపాద్ ప్రభుత్వాన్ని రద్దు చేసిన నెహ్రూతో తమకు విభేదాలున్నాయి గాని ఆయనపై ద్వేష ప్రచారానికి తాము వ్యతిరేకమని అన్నారు. ఎమర్జెన్సీని తాము వ్యతిరేకించాము గాని ఇప్పుడు దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తున్నదని హెచ్చరించారు. 56 అంగుళాల ఛాతీ గల ప్రధాని హయాంలో బయటి నుంచి ఎవరో మన దేశాన్ని అస్థిరపర్చే కుట్ర చేస్తున్నారని చెప్పుకోవడం అవమానం కాదా అని బ్రిట్టాస్ వేసిన ప్రశ్న ఎక్కడా కనిపించకపోవడం ఆశ్చర్యమే. సోరోస్‌తో సంబంధాలు దేశ ద్రోహం వంటి అంశాలపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి) వేయాలని కోరారు. ఆ కమిటీ పత్యేక దర్యాప్తు చేపడితే ఆ మూలాలు మోడీ ఇంటి దగ్గరే తేలతాయని బ్రిట్టాస్ వ్యాఖ్యానించారు. ఎందుకంటే మనం ఐక్యరాజ్యసమితి ప్రజాస్వామ్య నిధికి విరాళం ఇస్తున్నాం. దానికీ సోరోస్‌కూ సంబంధం వుంది. మరి మనమే ఆయనకు డబ్బు పంపుతున్నామా అని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో అమెరికా పాత్ర గురించి ఎందుకు మాట్లాడటం లేదు? అదానీ గురించి విస్తారంగా వచ్చినదాన్ని దాటేసి కృత్రిమంగా సోరోస్ రచ్చ ఎందుకు తెచ్చినట్టు? ఇటలీ వెబ్‌సైట్ మీడియా పార్ట్ రాఫెల్ హెలికాప్టర్ల గురించి బయటికి తీసిన దాన్ని వదలిపెట్టి సోరోస్ పై ఏదో రాసిందని ఇక్కడ మీడియాలో కథనాలు వదిలింది. తమ పేరును అనవసరంగా తీసుకొస్తున్నారని మీడియా పార్ట్ ఖండన కూడా ప్రకటించింది.

సోరోస్ అస్త్రం అదానీ కథనం నుంచి కాపాడలేక పోవడం, రాజ్యాంగ చర్చ కూడా రాజకీయంగా దారి తప్పించకపోవడంతో మోడీ సర్కార్ వ్యూహాలకు చుక్కెదురైంది. జమిలి బిల్లును ఆలస్యం చేసి మరీ రాజ్యాంగ చర్చను సాగదీయాలని మొదట భావించి ఆ మేరకు ప్రకటించారు. అయితే ఈ క్రమంలో అంబేద్కర్ వివాదం స్వయంగా అమిత్ షా ద్వారానే తెరపైకి తెచ్చారు. రాజ్యాంగాన్ని రూపొందించడం ద్వారా హక్కులు కల్పించిన అంబేద్కర్ పేరు చెప్పడాన్ని ఫ్యాషన్‌గా చిత్రిస్తూ దానికి బదులు దేవుడి పేరు అన్ని సార్లు తల్చుకుని వుంటేనన్నా పుణ్యం వచ్చేదని చెప్పడమంటే అర్థమేమిటి? ఇందులో వున్నదీ మత రాజకీయమే. అమిత్ షా వక్ర వ్యాఖ్య దేశ వ్యాపిత నిరసనలకు కారణమవడంతో బిజెపి వ్యూహాలు బెడిసికొట్టాయి. దాంతో ఆలోచన మార్చుకుని ఆదరాబాదరగా జమిలి బిల్లునే సభలో ప్రవేశ పెట్టారు. ఆ రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశ పెట్టడానికి పాటించాల్సిన నిబంధనలకు తిలోదకాలు వదలి మొండిగా ముందుకు తెచ్చారు. అయితే దాన్ని జెపిసికి పంపించడం ప్రజాసామ్యం కోసమేనన్నట్టు కొత్త నాటకం నడిపించారు. అయినా అసలు ఉద్దేశం బయటపడి పోయిందన్న నిస్పృహతోనే నేరుగా ప్రతిపక్ష నేతను అడ్డుకోవడానికి సిద్ధమైనారు. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే సభలోకి వస్తుంటే మకరద్వారం దగ్గర అయిదుగురు బిజెపి సభ్యులు అడ్డు తగలడమేమిటి? ఇలాంటిది గతంలో ఎప్పుడైనా జరిగిందా? తర్వాత బిజెపి సభ్యులు ప్రతాప్ చంద్ర సారంగి, ముఖేష్ రాజ్‌పుత్ గాయపడ్డారంటూ ఆయనపై నాలుగు సెక్షన్ల కింద కేసు పెట్టారు. వారు అడ్డుకోవడం వల్లనే ఘర్షణ జరిగిందని, తనకూ గాయమైందని ఖర్గే ప్రకటించారు. కాంగ్రెస్ సభ్యులు దీనిపై ఎదురు కేసు పెట్టారు. కాని పోలీసులు కేవలం పాలకపక్షం ఫిర్యాదులపైనే దర్యాప్తు చేస్తూ తమ ఫిర్యాదులను పెడచెవిని పెట్టారని కాంగ్రెస్ నేతలు విమర్శిస్తున్నారు. ఈ ఘర్షణలను సాకుగా చూపించి సభను ముందే వాయిదా వేశారు. అంతేగాక పార్లమెంటు ప్రాంగణంలో నిరసనలు నిషేధిస్తున్నట్టు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. ఇది ఎప్పటి నుంచో వున్న సంప్రదాయాలను, హక్కులను నిరాకరించడమే. నిరసనల పట్ల మోడీ సర్కారు ఎంత అసహనంగా వుందో దీంతోనే తెలిసిపోతున్నది.

ఇక రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్‌పై అవిశ్వాస తీర్మానం నోటీసును తిరస్కరించడం ఇంకో పరిణామం. పైగా సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగించడం తగదని ఆయన సూక్తులు చెబుతూ సభను ముగించారు. ఉభయ సభల్లోనూ నిరసనలు లేకుండా అడ్డుకోవడం, ప్రతిపక్షాలు ఎంత అభ్యర్థించినా న్యాయమైన చర్చలకు అనుమతించకుండా వాటిపైనే విద్రోహం ఆరోపణలు చేయడం బిజెపి ఇరకాటానికి అద్దం పట్టింది. చర్చలు సవ్యంగా జరిగితే ఎదుర్కోలేమన్న భయంతోనే ముందే అడ్డుకోవడం ఇక్కడ వ్యూహం. అంతా అయ్యాక రాజ్యసభ 60 శాతం, లోక్‌సభ 45 శాతం సమయం వృథా అయ్యిందని, పెట్టిన 16 బిల్లులలో ఒక్కదాన్నే ఆమోదించ గలిగిందని మొసలి కన్నీళ్లతో నివేదికలు విడుదల అయ్యాయి. అంబేద్కర్‌ను అవమానించినందుకు క్షమాపణలు చెప్పడం గానీ కనీసం సర్దిచెప్పడం గానీ ఇప్పటికీ జరగలేదంటే మనువాద సిద్ధాంతకర్తల నిజస్వరూపం ఏమిటో తెలుస్తుంది. నిజానికి 1992లో అంబేద్కర్ వర్ధంతి రోజైన డిసెంబర్ 6న బాబ్రీ మసీదు విధ్వంసానికి పాల్పడినప్పుడే వారు లౌకిక తత్వంతో పాటు పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపైనా అంబేద్కర్‌పైన తమకే మాత్రం గౌరవం లేదని చేతల్లో చెప్పేశారు.

రాహుల్ గాంధీపై కేసును నేర పరిశోధన విభాగానికి అప్పగించారు గనక ఏ మలుపు తిప్పుతారనేది చెప్పలేం. కాంగ్రెస్ వైపునా ఏమైనా లోపాలుంటే వుండొచ్చుగానీ అసలైన బాధ్యత అధికార పార్టీదే. ఇదే సమయంలో ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ ప్రతి మసీదు కింద మందిరాలున్నాయని వివాదాలు విస్తరించడం సరికాదని నీతి పాఠాలు చెప్పడం కూడా సందేహాలు పెంచింది. ఎందుకంటే అన్ని చోట్లా కాదు, కొన్నిటిపై కేంద్రీకరించాలనే వ్యూహం తీసుకోబోతున్నట్టు కనిపిస్తుంది. అయోధ్య తర్వాత 'కాశీ, మధుర బాకీ హై' అన్న వారి ప్రచారం బాగా తెలిసిందే గనక ఆ దిశలో వ్యూహాలు నడవొచ్చు. సంభాల్‌లో మసీదు సర్వేను సుప్రీం కోర్టు నిలిపేసినా అదే చోట మరేదో మందిరం బయట పడిందంటూ జాతీయ స్థాయిలోనే హడావుడి సాగిస్తున్నారు. అక్కడ సర్వేలు మొదలెట్టారు. అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి శేఖర్ కుమార్ యాదవ్ విహెచ్‌పి సభలో విద్వేష ప్రసంగం చేయడాన్ని సుప్రీం కోర్టు కొలీజియం పిలిచి మందలిస్తే యుపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సమర్థిస్తున్నారు. మసీదులు, మందిరాలపై మోహన్ భగవత్ మాట్లాడిన దానికి భిన్నంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు వినిపిస్తున్నారు. ఈ ద్వంద్వ క్రీడ మనకు బాగా పరిచితమైన సంఘ పరివార్ పని విభజనలో భాగమే. తమ వాదనలు వ్యూహాలు దాడులపై నిరసన వస్తున్నది గనకే సన్నాయి నొక్కుల పని ఒకరు తీసుకుంటే మరొకరు షరామామూలుగా విద్వేషకాండ సాగిస్తున్నారని అర్థం చేసుకోవాలి. తిరుమల కొండపై అన్య మత ఉద్యోగుల తొలగింపు అంటూ మొదలు పెట్టి ఇప్పుడు షికారి తెగవారిపై ఆ ముద్ర వేసి దుకాణాలు మూయించి వెళ్లగొట్టడం దేనికి నిదర్శనం? సనాతన మతమే భారతీయుల జాతీయ మతమని యోగి ఆదిత్యనాథ్ ఉవాచ. ఒకే దేశం, ఒకే ఎన్నిక, ఒకే మతం, ఒకే పార్టీ, ఒకే నేత అనే నినాద పరంపరకు పరాకాష్టగానే వీటిని చూడక తప్పదు. ఇంతా చేసి లోక్‌సభలో మెజార్టీ కోల్పోవడం, రాజ్యసభలో అసలే లేకపోవడం బిజెపికి మింగుడు పడని పరిస్థితిగా తయారైంది. తత్ఫలితంగానే పార్లమెంటును రణ క్షేత్రంగా మార్చేందుకు సిద్ధమైపోయారని తాజా సమావేశాలు చేసిన హెచ్చరిక.

# 'మున్సిపల్ ' సమ్మె ఒప్పందాల అమలులో నిర్లక్ష్యం

రాష్ట్రంలో గత 7 నెలల క్రితం ఏర్పడిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వంపైన అన్ని రంగాల కార్మికులతోపాటు మున్సిపల్ కార్మికులు కూడా గంపెడు అశలు పెట్టుకున్నారు. ముఖ్యంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు గత వైసిపి ప్రభుత్వ పాలనలో తమకు జరిగిన అన్యాయానికిగాను కసితో తెలుగుదేశం కూటమికి ఓట్లు వేశారు. టిడిపి ప్రభుత్వం ఏర్పడిన తరువాత నారా లోకేష్, ఇతర మంత్రులను పలుమార్లు కలిసి జీతాలు పెంచి తమ కుటుంబాలను ఆదుకోవాలని వేడుకున్నారు. అయినప్పటికీ జీతాల పెంపు విషయంలో ప్రభుత్వం నుండి ఏ విధమైన స్పందన లేకపోవడంతో పోరు బాట పట్టేందుకు సిద్ధపడుతున్నారు.వైసిపి ప్రభుత్వ హయాంలో 'సమాన పనికి సమాన జీతం, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పర్మినెంట్' హామీల అమలు కోసం మున్సిపల్ కార్మికులు దీర్ఘకాలిక పోరాటాలు నిర్వహించారు. నిర్బంధాలు, అరెస్టులు, అక్రమ కేసులు ఎదుర్కొని మిలిటెంట్ పోరాటాలు నిర్వహించారు. 2023 డిసెంబర్ 26 నుండి 2024 జనవరి 11వ తేదీ వరకు 17 రోజులు చారిత్రాత్మక సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం దిగి వచ్చి 'క్లీన్ ఎన్విరాన్‌మెంట్' వర్కర్లకు (33,500 మందికి) రూ.15 వేల నుండి రూ.21 వేలకు, యుజిడి, చెత్త వాహనాల డ్రైవర్లకు రూ.18,500 నుండి రూ.24,500కు జీతాలు పెంచుతూ జీవో ఎం.ఎస్. నెంబర్ 36 జారీ చేసింది. 12-13 వేల మందిగా ఉన్న ఇంజనీరింగ్ కార్మికులకు జీతాల పెంపు కోసం 9 మంది అధికారులతో కమిటీ ఏర్పాటు చేసింది. ఈ సమ్మె సందర్భంగా రాష్ట్ర వ్యాపితంగా నమోదు చేసిన పోలీసు కేసులన్నింటిని ఉపసంహరిస్తూ 2024 మార్చి 15వ తేదీ 357 జీవోను జారీ చెయ్యడమంటే రాష్ట్ర కార్మికోద్యమ చరిత్రలో గర్వించదగిన పోరాటం.మున్సిపల్ రంగంలోని 48 వేల మందిగా ఉన్న ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికులందరికీ వర్తింపచేసే విధంగా నాటి ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన హామీలు ఊసులో లేకుండా పోయాయి. రిటైర్మెంట్ బెనిఫిట్లు (10 సంవత్సరాల సర్వీసు ఉంటే రూ.75 వేలు ఆ పైన ఏడాదికి రూ.2 వేలు అదనంగా), ప్రమాద బీమా రూ.5 లక్షల నుండి రూ.7 లక్షలకు పెంపు, దహన సంస్కారాలకు రూ.15 వేల నుండి రూ.20 వేలకు పెంపు, ఇంజనీరింగ్ కార్మికుల జీతాల పెంపు, సంక్షేమ పథకాలు, పర్మినెంట్ కార్మికులకు సరండర్ లీవ్‌లు, జి.పి.ఎఫ్ అకౌంట్లు తదితర డిమాండ్ల పరిష్కారానికి 2024 జనవరి 24వ తేదీన నాటి ప్రభుత్వం ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌కు సిఫార్సు చేసింది. కాగా ఆ తరువాత సాధారణ ఎన్నికలు రావడంతో ఈ ఫైళ్ల వ్యవహారం మూలన పడింది. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వచ్చీ రాగానే ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో ఉన్న మున్సిపల్ కార్మికుల ఫైళ్లన్నింటిని తిరిగి వెనక్కి పంపించింది. ఇది జరిగి 5 నెలలు గడిచినా పట్టించుకునే నాథుడు లేడు. దీనితో తెలుగుదేశం కూటమి ప్రభుత్వంపై మున్సిపల్ కార్మికులు పెట్టుకున్న ఆశలు అడియాసలుగా మారుతున్నాయనే




ఆందోళన ప్రారంభమైంది.రాష్ట్రంలో ఉద్యోగులతో పాటు కొన్ని శాఖలలో రిటైర్మెంట్ వయస్సును 62 ఏళ్ళకు పెంచారు. కాని మున్సిపల్ కార్మికులకు మాత్రం పెంచలేదు. 60 ఏళ్ళు నిండాయనే సాకుతో బలవంతంగా ఉద్యోగాల నుండి తొలగిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడుతున్నవారి, చనిపోయిన వారి స్థానంలో వారి పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వడంలేదు. గత ఏదాది కాలంగా చనిపోయిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియో చెల్లించడంలేదు. ఇవి కాకుండా పి.ఎఫ్ క్లెయిమ్‌లు రకరకాల సాకులతో దీర్ఘకాలికంగా పెండింగ్ పెడుతున్నాయి. కార్మికులకు పని చేసేందుకు అవసరమైన పనిముట్లు సైతం సక్రమంగా అందించడంలేదు. అధికారులకు ఎన్ని సార్లు విన్నవించినా చెవిటివాని ముందు శంఖం ఊదినట్లుగానే ఉంటున్నది.నింగ్, గార్డెనింగ్, వెటర్నరీ, మెకానిక్‌లు తదితర విభాగాలలో పని చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు పనికి తగిన విధంగా జీతాలు చెల్లించడంలేదు. 2012లో ప్రభుత్వం జారీ చేసిన జీవో ఎం.ఎస్. నెంబర్ 11 లోని క్యాటగిరీల ప్రకారం మున్సిపల్ కార్మికులకు జీతాలు చెల్లించడంలేదు. 2018 వరకు పారిశుధ్య కార్మికులతో సమానంగా ఇంజనీరింగ్ కార్మికులకు కూడా జీతాలు చెల్లించారు. ప్రస్తుతం అత్యధిక మంది ఇంజనీరింగ్ కార్మికులకు రూ.15 వేలు మాత్రమే జీతాలు చెల్లిస్తున్నారు. ప్రమాదకరమైన విధులు నిర్వహిస్తున్నప్పటికీ రిస్క్ అలవెన్స్ చెల్లించడంలేదు. దూర ప్రాంతాలకు వెళ్లి పని చేసే సందర్భంలో కనీసం టిఎ, డిఎలు కూడా ఇవ్వడంలేదు. ఎమర్జెన్సీ సర్వీసు పేరుతో ఊడిగం చేయిస్తున్నారు తప్ప వీరి కుటుంబాల గురించి పట్టించుకోవడంలేదు.

%దశాబ్దాల తరబడి పని చేస్తున్న వందలాది మంది ఎన్.ఎం.ఆర్ కార్మికులకు నేటికీ రూ.13 వేలు మాత్రమే జీతాలు చెల్లిస్తున్నారు. పట్టణాల విస్తరణ మేరకు కార్మికుల సంఖ్యను పెంచాలని మున్సిపల్టీల నుండి ప్రతిపాదనలు వచ్చి అనేక సంవత్సరాలు గడుస్తున్నా ఆర్థికశాఖ అనుమతులు ఇవ్వడంలేదు. మున్సిపల్ కౌన్సిల్ తీర్మానాల పేరుతో పని చేయిస్తున్న బదిలీ, కోవిడ్ కార్మికులకు మున్సిపల్ కార్మికులుగా గుర్తించకుండా 12 వేల రూపాయలు మాత్రమే జీతాలు ఇస్తున్నారు. పల్నాడు జిల్లా నర్సరావుపేటలో నెలంతా పని చేయించుకొని కేవలం రూ.4-5 వేలు మాత్రమే చెల్లిస్తున్నారు. ఎన్‌టిఆర్ జిల్లా నందిగామలో ఇదే పరిస్థితి కొనసాగుతున్నది. తమను వెట్టిచాకిరీ నుండి విముక్తి చెయ్యాలని ఎన్‌ఎంఆర్, బదిలీ, కోవిడ్ కార్మికులు ప్రభుత్వాలను కోరుతున్నారు.రాష్ట్రంలో పాలకులు మారారు తప్ప విధానాలు మారడంలేదు. శాశ్వత స్వభావం కలిగి విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చెయ్యకుండా ఒప్పంద కార్మికుల పేరుతో పాలకులు దగా చేస్తున్నారు. తెలుగుదేశం కూటమి అధికారంలోకి వచ్చాక గత సమ్మె కాలపు ఒప్పందాల అమలు పట్ల అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ రాష్ట్ర వ్యాపితంగా దశలవారీ ఆందోళనా పోరాటాలకు ఎ.పి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. గత ఏడాది సమ్మె ప్రారంభమైన డిసెంబర్ 26వ తేదీన రాష్ట్ర వ్యాపితంగా ధర్నాలు, సమ్మె ముగింపు రోజైన జనవరి 11వ తేదీన రిలే నిరాహార దీక్షలు, ఇంజనీరింగ్ కార్మికుల జీతాల పెంపునకు జనవరి 3వ తేదీన ధర్నాలు చేయాలని నిర్ణయించింది. ఈ పిలుపుల్లో మున్సిపల్ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చెయ్యాలని కార్మికులకు విజ్ఞప్తి చేస్తున్నది.